ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
బుధవారం 26 మార్చి 2025





మొదటి బహుమతి కూపన్ తీస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

మొదటి బహుమతి (మోటారు సైకిల్)
డి.వత్సల, 19-7-104, ఎ, గోపాలరాజు కాలనీ, తిరుపతి

ద్వితీయ బహుమతి (రిఫ్రిజిరేటర్)
నగేష్ మరుదాడ, 18-1-26/బి6, భారతీ నిలయం, కపిలతీర్థం రోడ్డు, తిరుపతి

తృతీయ బహుమతి (టీవీ)
టి.కె.శశిధర్, 3-56, పాతపేట, నెహ్రూనగర్, పలమనేరు

'ఆంధ్రజ్యోతి' పాఠకులకు

బహుమతుల బొనాంజా

- కూపన్లు తీసి విజేతలను ఎంపిక చేసిన ముఖ్య అతిథులు





రెండు, మూడు బహుమతుల కూపన్లను తీస్తున్న 'వేము' ఇంజనీరింగ్ కళాశాల అధినేత చంద్రశేఖర్ నాయుడు.. డాక్టర్ వెంకటరమణ

తిరుపతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి పాఠకులకు కార్ అండ్ బైక్ రేసు పోటీకి సంబంధించి మంగళవారం లక్కీ డ్రా జరిగింది. గతేడాది నవంబరు ఒకటి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ నడుమ నెలకు మూడు చొప్పున మొత్తం 12 కూపన్లను నాలుగు సెట్లుగా వేలాది మంది పాఠకులు ఎడిషన్ కార్యాలయానికి పంపారు. వీటిని మంగళవారం సాయంత్రం రేణిగుంట మండలం దామినేడు సమీపంలోని ఆంధ్రజ్యోతి ఎడిషన్ కార్యాలయంలో ఈ కూపన్లను డ్రా తీశారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, 'వేము' ఇంజనీరింగ్ కళాశాల అధినేత చంద్రశేఖర్ నాయుడు, తిరుపతికి చెందిన వెంకటరమణ గుండె, మెటర్నటీ ఆస్పత్రి అధినేత డాక్టర్ వెంకటరమణ.. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కూపన్లు తీసి విజేతలను ప్రకటించారు. అనంతరం ముఖ్య అతిథులు ఆయా విజేతలకు ఫోన్లు చేసి బహుమతులు గెలుచుకున్న విషయం తెలియజేసి శుభాకాంక్షలు చెప్పారు. వీరికి త్వరలో ఎడిషన్ కార్యాలయంలో సంబంధిత బహుమతులను అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు, తిరుపతి బ్రాంచి మేనేజర్ సురేష్‌రెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జి వి.సుధాకరబాబు, సర్క్యులేషన్ ఇన్‌చార్జి ఉమాపతి, ఏడీవీటీ ఇన్‌చార్జి ఈశ్వరనాయుడు, ప్రొడక్షన్ ఇన్‌చార్జి మోహన్‌రావు, బ్యూరో ఇన్‌చార్జి శివప్రసాద్, కార్యాలయ సిబ్బంది, పలువురు ఆంధ్రజ్యోతి పాఠకులు పాల్గొన్నారు.

కన్సొలేషన్ బహుమతుల వివరాలు 6లో



అమరావతిలో జరిగిన సదస్సులో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ

ప్రత్యేక లక్ష్యాలతో
జిల్లా అభివృద్ధి

- కలెక్టర్ల సదస్సులో ప్రతిపాదించిన సుమిత్ కుమార్

చిత్తూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అన్ని అంశాల్లో వెనుకబడిపోయిన జిల్లాను కూటమి ప్రభుత్వం అంశాల వారీగా ప్రత్యేక లక్ష్యాలను నిర్దేశించుకుని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోంది. అమరావతిలో మంగళవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో ఈ విషయమై సుదీర్ఘ కసరత్తు నడిచింది.ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి కోసం సిద్ధం చేసిన ప్రతిపాదనలను కలెక్టర్ సుమిత్ కుమార్ అందజేశారు.వాటిలో ముఖ్యాంశాలు ఇలా...

జిల్లాకు గతంలో, ఇప్పుడు కేటాయించిన నిధులు (రూ.కోట్లలో..)

శాఖ	2024-25	2025-26
వ్యవసాయం	671	741
హార్టికల్చర్	6,779	7,912
పశు సంవర్థకం	10,685	12,757

● రాబోయేది ఇబ్బందికర మామిడి సీజన్

రానున్నది జిల్లాకు కీలకమైన మామిడి సీజన్. కానీ అనేక కారణాలతో మామిడి ఎగుమతులు తగ్గిపోయాయి. జిల్లాలో అధికంగా ఉత్పత్తి అవుతున్న తోతాపురి కాయల్ని గుజ్జు తయారీకి ఉపయోగిస్తారు. 2024లో సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి గుజ్జు అమ్ముడుపోకుండా, ఎగుమతి కాకుండా మిగిలిపోయింది. ఇదే పరిస్థితి కొనసాగితే తాజా సీజన్‌లో కూడా రైతులు తమ ఉత్పత్తుల్ని న్యాయమైన ధరలకు అమ్ముకోలేరు.మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు ఎన్‌పీఏని నివారించడానికి రుణ వాయిదా, వడ్డీలను 6 నెలల పాటు వాయిదా వేయాలని ప్రతిపాదించారు.

● మామిడి బోర్డు ఏర్పాటుకు ప్లానింగ్

జిల్లాలో మామిడి రైతులు అధికంగా ఉన్న నేపథ్యంలో మామిడి బోర్డును ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఏళ్లుగా వుంది. పోయిన ఎన్నికల్లోనూ ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావు, ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీ మోహన్ బోర్డు ఏర్పాటుకు హామీ ఇచ్చారు. తాజాగా ఎంపీ దగ్గుమళ్ల పార్లమెంటులోనూ ఈ అంశం గురించి మాట్లాడారు. మంగళవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో కూడా తాజా ఆర్థిక సంవత్సరంలో చిత్తూరులో మామిడి బోర్డు ఏర్పాటుకు ప్లాన్ చేస్తున్నట్లు యాక్షన్ ప్లాన్‌ను సబ్మిట్ చేశారు. బోర్డు ఏర్పడితే మామిడి పరిశోధన, ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఉత్పత్తుల ఎగుమతి, మెరుగైన ధరలు.. వంటి లాభాలుంటాయి.

● కేవీకేతో సీజన్‌కు 1500మంది రైతులకు శిక్షణ

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కుప్పంలో మంజూరైన కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు భూసేకరణ కూడా చేశారు.ఏర్పాటుకు కేంద్ర నిధుల కోసం చూస్తున్నారు. దీన్ని ఏర్పాటు చేస్తే వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్థకం వంటి అంశాల్లో సీజన్‌కు 1500 మంది రైతులకు శిక్షణ ఇవ్వచ్చు.

● 'స్కిల్ ఆఫ్ చిత్తూరు'తో రైతులకు డిజిటల్ శిక్షణ

15 వేల మంది రైతులకు ప్రాథమిక డిజిటల్ నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ ఆఫ్ చిత్తూరు అనే ప్రాజెక్టును ప్రారంభించారు. ఇందులో భాగంగా రైతులకు స్మార్ట్ ఫోన్ వాడకం, వాతావరణ సూచనల తనిఖీ, మార్కెట్ ధరల్ని పోల్చడం, డిజిటల్ చెల్లింపులు, వ్యవసాయ సలహాల కోసం సంప్రదించడం.. వంటి అంశాల్లో ఆగస్టులోగా శిక్షణ ఇవ్వనున్నారు.

● నియోజకవర్గానికో పారిశ్రామిక పార్కు

జిల్లాలోని 7 నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కుల్ని ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే రూ.351.93 ఎకరాల భూమిని గుర్తించారు. వచ్చే మూడేళ్లలోగా 450 ఎంఎస్ఎంఈ యూనిట్లను రూ.150 కోట్లతో ఏర్పాటు చేసి 4500 మందికి ఉపాధి కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

● ననియాల ఎకో పార్కు అభివృద్ధి

రామకుప్పం మండలంలోని ననియాల ఎకో టూరిజం పార్కును అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇక్కడ జంగిల్ సఫారీ ట్రాక్, ఎలిఫెంట్ ఆశీర్వాద్, చిల్డ్రన్ పార్కు, రెస్టారెంట్, హోమ్ స్టే, డార్మెటరీ, స్విమ్మింగ్ పూల్, ట్రెక్కింగ్, హార్స్ రైడింగ్, క్యాంప్ ఫైర్ వంటి సౌకర్యాలు కల్పించేందుకు పనులు చేస్తున్నారు. ఇవన్నీ పూర్తయితే సుమారు 1786 మందికి ప్రత్యక్ష, 3382 మందికి పరోక్ష ఉపాధి లభించనుంది. రోజుకు సుమారు 300 మంది చొప్పున ఏడాదికి లక్ష మంది ఇక్కడికి వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

ఏవి ఎప్పుడు పూర్తవుతాయంటే..

- పీఎం సూర్యఘర్ యోజన పథకం కింద వచ్చే ఏడాది మార్చి లోగా జిల్లాలోని 92,544 గృహాలపై సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేయడం
- మన జిల్లా పరిధిలో రూ.3,997 కోట్లతో నిర్మాణంలో ఉన్న బెంగుళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ వే వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి కానుంది.
- చిత్తూరు- తచ్చూరు హైవే మన జిల్లా పరిధిలో 75 కిలోమీటర్ల మేర రూ.2,366 కోట్లతో నిర్మాణ దశలో ఉంది. ఇది వచ్చే అక్టోబరు నాటికి పూర్తి కానుంది.
- హంద్రీనీవా కుప్పం, పుంగనూరు బ్రాంచి కాలువలకు జరుగుతున్న కాంక్రీట్ లైనింగ్ పనులు ఈ ఏడాది మేలోగా పూర్తి కానున్నాయి.
- రూ.14 కోట్లతో జరుగుతున్న చిత్తూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వచ్చే సెప్టెంబరు లోగా పూర్తి కానున్నాయి.
- ప్రజల ఆర్థిక లావాదేవీలను మెరుగు పరిచేందుకు ఆరు నెలల్లో మరో 20 నూతన బ్యాంకు శాఖలు జిల్లాలో ఏర్పాటు కానున్నాయి.
- చిత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మసముద్రంలో 19 ఎకరాలు, పుంగనూరు మండలంలోని మేలుందొడ్డిలో 10 ఎకరాల భూమిని గుర్తించారు. ఆరు నెలల్లో ఇక్కడ ప్రభుత్వం ఎంఐజీ లేఅవుట్ ఏర్పాటును పూర్తి చేస్తుంది.

కలెక్టర్ల సదస్సులో ప్రతిపాదించిన మరిన్ని.....

- పలమనేరు మున్సిపాలిటీకి ప్రధాన నీటి వనరు ఎండిపోయిన కారణంగా వచ్చే వేసవిలో ఇక్కడ తాగునీటి సమస్య రానుంది. ఈ వేసవి సమస్య పరిష్కారానికి ఇక్కడ రూ.91 లక్షలు అవసరం.
- చిత్తూరు,కుప్పం ప్రాంతాలకు మంజూరైన కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేయాల్సి ఉంది.
- కుప్పంలో పట్టు పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేయాలి.
- కేంద్ర మామిడి అభివృద్ధి బోర్డు ఏర్పాటు
- జిల్లాలో ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపో ఏర్పాటు
- పుంగనూరు నియోజకవర్గంలోని 7 నీటి ప్రాజెక్టుల భూసేకరణ కోసం రూ.96.40 కోట్ల నిధులు అవసరం.

వడదెబ్బ తగలకుండా...

వెదురుకుప్పం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రత, వేడిగాలుల కారణంగా వడదెబ్బ తగలడం, డీహైడ్రేషన్‌కు లోను కావడం జరుగుతుంటుంది.సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ఇవి ప్రాణాంతకంగా మారే ప్రమాదముంది. పళ్లరసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ లాంటి ద్రవ పదార్థాలతో పాటు ఎక్కువగా నీళ్లు తాగడం చేస్తుండాలి.ఎండ వేళ ఇంటిపట్టునే ఉండాలి. బయటికి వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపి వంటివి తీసుకెళ్లాలి. ఇంట్లో కిటికీలు తెరిచి ఉంచాలి. ఫ్యాన్ వేసి చల్లగా ఉంచుకోవాలి.మాంసాహారం తగ్గించాలి.ఒకవేళ వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలోకి వెళితే నీళ్లు తాగించకూడదు. వీలైనంత త్వరగా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలి.




చిత్తూరు ఎమ్మెస్సార్ సర్కిల్లో ఎండల దెబ్బకు ఖాళీగా మారిన రోడ్డు

కుంపటి బాబోయ్...!

- 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలో ఎండ తీవ్రత పెరుగుతుండడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మంగళవారం అత్యధికంగా తవణంపల్లెలో 40.1, గంగవరంలో 39 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.నింద్రలో 38.8డిగ్రీలు, శ్రీరంగరాజపురంలో 38.8, వెదురుకుప్పంలో 38.5, చిత్తూరులో 38.1, గుడుపల్లిలో 38.1, గుడిపాలలో 38.1, పులిచెర్లలో 37.9, నగరిలో 37.8, పెద్దపంజాణిలో 37.7, పలమనేరులో 37.5, బంగారుపాళ్యంలో 37.1, సదుంలో 37, చౌడేపల్లె, ఐరాల, పాలసముద్రం, పెనుమూరు, విజయపురం మండలాల్లో 36.9, వి.కోటలో 36.7, రొంపిచెర్ల, సోమల మండలాల్లో 36.6, పూతలపట్టులో 36.3, గంగాధరనెల్లూరులో 36.1, యాదమరిలో 36, శాంతిపురంలో 35.8, బైరెడ్డిపల్లిలో 34.7, కార్వేటినగరంలో 34.6, రామకుప్పంలో 34.5, కుప్పంలో 33.9, పుంగనూరులో 33.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:29 (బుధవారం సాయంత్రం)
సహర్: 4:52 (గురువారం ఉదయం)





గంగమ్మకు తొలిపూజ చేస్తున్న జమిందారీ కుటుంబీకులు

పూజలందుకున్న గంగమ్మ

- వేడుకగా పుంగనూరు జాతర ప్రారంభం
- వైభవంగా సాగిన అమ్మవారి ఊరేగింపు

పుంగనూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు జమీందారు వంశీకుల కులదైవమైన సుగుటూరు గంగమ్మ జాతర మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. స్థానిక నగరిలోని జమిందారీ ప్యాలెస్‌లో ఉన్న అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల మధ్య భక్తుల దర్శనార్థం ఉంచారు. రాత్రి జమిందారు కుటుంబీకులు వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో గంగమ్మకు తొలిపూజ నిర్వహించారు. జమిందారు వంశీకులైన సోమశేఖర చిక్కరాయలు, మల్లికార్జున చిక్కరాయుల కుటుంబీకులు సుగుటూరు గంగమ్మకు చీర, సారె, పండ్లు, పూలు సమర్పించి పూజలు నిర్వహించారు.అనంతరం గంగమ్మకు ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి,జనసేన నేత వేణుగోపాల్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు.వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ప్యాలెస్‌లోని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, ప్రముఖ న్యాయవాది వెంకటముని యాదవ్, టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీరెడ్డి అమ్మవారికి గెరిగెలు సమర్పించారు. అనంతరం ప్రత్యేకంగా పూలతో ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌పై సుగుటూరు గంగమ్మను తేరువీధి, సుబేదారువీధి, కుమ్మరవీధుల మీదుగా తిరిగి నగరి ప్యాలెస్ వరకు బాణాసంచా పేలుళ్ల, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా జంతుబలులిచ్చి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారిని ప్యాలెస్ ఆవరణంలోని ఆలయంలో ప్రతిష్ఠించారు.

జాతర సందర్భంగా పట్టణంలోని శక్తి అమ్మవార్లుగా నలుదిక్కుల్లో ప్రతిష్ఠింపబడిన నడివీధి గంగమ్మ, తూర్పుమొగసాల గంగమ్మ, మల్లారమ్మ గంగమ్మ, నల్లగంగమ్మ, విరూపాక్షి మారెమ్మ, బోయకొండ గంగమ్మలైన అష్టగంగమ్మల ఆలయాలకు ప్రజలు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. విరూపాక్షి మారెమ్మ ఆలయంలో భక్తులు గెరిగెలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. రాంపల్లె గంగమ్మను వైభవంగా ఊరేగించారు.

గంగమ్మ దర్శనం నేడుమాత్రమే

నగరి ప్యాలెస్‌లోని సుగుటూరు గంగమ్మ ఆలయంలో భక్తుల దర్శనార్థం అమ్మవారిని బుధవారం ఒక్కరోజే నిర్వాహకులు ఉంచుతారు. మంగళవారం రాత్రి ఊరేగింపు అనంతరం బుధవారం తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో అమ్మవారిని స్థానిక ఆలయంలో ప్రతిష్ఠించాక భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు. బుధవారం రాత్రి 12 గంటల ప్రాంతంలో గంగమ్మను ఊరేగింపుగా తీసుకెళ్లి తూర్పుమొగసాల సమీపంలోని చాముండేశ్వరి ఆలయం వద్ద జలాభిషేకం నిర్వహించి తిరిగి గురువారం తెల్లవారు జామున గంగమ్మ ఉత్సవవిగ్రహాన్ని తీసుకొచ్చి ప్యాలెస్‌లో భద్రపరుస్తారు. అమ్మవారి దర్శనం మళ్లీ వచ్చే ఏడాది గంగజాతరకే భక్తులకు లభిస్తుంది. అంత వరకు అమ్మవారి విగ్రహం లేకుండా సుగుటూరు గంగమ్మ ఆలయం ఉంటుంది.





గంగమ్మ ఊరేగింపులో జనసందడి - (ఇన్‌సెట్‌లో)సుగుటూరు గంగమ్మ

పీఠాధిపతులను కలిసిన టీటీడీ చైర్మన్



తిరుమల, మార్చి25(ఆంధ్రజ్యోతి): పాలిమారు మఠాధిపతి విద్యాధీశ తీర్థస్వామిజీ, భీమనకట్టె మఠాధిపతి రఘువరేంద్ర తీర్థస్వామిజీని తిరుమలలోని వ్యాసరాజ మఠంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హిందూ ధర్మవ్యాప్తికి టీటీడీ చేపడుతున్న కార్యక్రమాలు, సీఎం చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్ర రాజధానుల్లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి చేస్తున్న కృషిని ఆయన వివరించారు. భక్తులు సంతృప్తిగా తిరుమల యాత్ర చేసుకునేలా టీటీడీ పనిచేయాలని పీఠాధిపతులు సూచించారు. అనంతరం చైర్మన్‌ను స్వామిజీలు శాలువాతో సన్మానించి, మహాభారతం గ్రంథాన్ని బహూకరించారు. టీటీడీ బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్ కూడా పాల్గొన్నారు.


మేఘనాథరెడ్డికి చంద్రశేఖరరావు పురస్కారం

● వచ్చే నెల 13 న పురస్కార ప్రదానం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): యువ కథా, నవలా రచయిత కెవి మేఘనాథరెడ్డికి డాక్టర్ వి. చంద్రశేఖర రావు సాహిత్య పురస్కారం ప్రకటించారు. పలమనేరు మండలం కాలువపల్లెకు చెందిన మేఘనాథరెడ్డి 2019 లో 'కరిగిపోవే కన్నీటి చుక్క' కవితా సంపుటి, 2021 లో అగజాత', నవల, 2022 లో కలుంకూరి గుట్ట కథా సంపుటి, 2024 లో 'పాయిదరువులు' నవల వెలువరించారు. విమలాశాంతి, రజనీశ్రీ, గంటా కమలమ్మ, మహేశ్వరయ్య, భాగీరథి కథా పురస్కారాలు పొందారు. ఏప్రిల్ 13న చంద్రశేఖరరావు జయంతి సందర్భంగా గుంటూరులో నిర్వహించే సభలో పురస్కార ప్రదానం చేయనున్నట్టు డాక్టర్ వి. ప్రసూన తెలిపారు.

సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు భారీగా క్యూలైన్‌లో వేచి ఉన్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ సర్కిల్ వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.45 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,358

తలనీలాలు సమర్పించినవారు: 27,024

పురుషోత్తముడికి పుష్పయాగం





స్నపనతిరుమంజనం - స్వామివారికి పుష్పయాగం

చంద్రగిరి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పుష్పయాగం వైభవంగా జరిగింది. ఈఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంలో ఏమైనా లోపాలు చోటుచేసుకుని ఉంటే ప్రాయశ్చిత్తంగా ఈవేడుక నిర్వహించారు. ఉదయం నిత్యకట్ల కైంకర్యాలనంతరం 7 నుంచి 10 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. 10 నుంచి 11 గంటల వరకు ఉత్సవర్లను ప్రత్యేక వేదికపై కొలువు దీర్చి వివిధ రకాల సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకించారు. స్నపన తిరుమంజపం నిర్వహించారు. మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పుష్పయాగం కన్నులపండువగా జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, రాష్ట్రాల నుంచి టీటీడీ, దాతలు ద్వారా అందిన మూడున్నర టన్నుల పుష్పాలతో వేద పండితులు స్వామివారికి అర్చన చేశారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్,అర్చకులు శేషాద్రిచార్యులు, బాలాజీ రంగాచార్యులు, పార్థసారథి సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు మునికుమార్‌రెడ్డి, ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవాణిట్రస్టు మంచి కార్యక్రమం: నటుడు సుమన్



తిరుమల, మార్చి25(ఆంధ్రజ్యోతి): శ్రీవాణిట్రస్టు ద్వారా శ్రీవారిని దర్శించుకునే విధానం ఓ మంచి కార్యక్రమం అని ప్రముఖ సినీనటుడు సుమన్ అన్నారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. భక్తుల్లో కొందరు తమ స్థాయికి తగ్గట్టుగా శ్రీవారిని దర్శించుకుంటారని, అందులో శ్రీవాణిట్రస్టు ద్వారా స్వామిని దర్శించుకునే పద్ధతి చాలా బాగుందన్నారు. ఎయిర్‌పోర్టులో కూడా ఈ టికెట్లును కేటాయిస్తుండటంతో చాలా మంది టికెట్లు పొంది తిరుపతిలోని స్థానిక ఆలయాలన్నీ దర్శించుకుని తిరిగి మరుసటి రోజు తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకుంటున్నారన్నారు. ఇక, తన అభిమానులు, నిర్మాతలు, దర్శకులు, టెక్నీషియన్లు అందరు బాగుండాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

పైరసీ క్వాలిటీతో వచ్చేస్తోంది

● సినీ నిర్మాత నాగవంశీ



తిరుమల, మార్చి26(ఆంధ్రజ్యోతి): 'ఈమధ్య పైరసీ ఇబ్బందులు అధికమయ్యాయి. సినిమా విడుదలైన రెండు మూడు రోజులకే చాలా క్వాలిటీతో పైరసీ బయటికి వచ్చేస్తోంది. దాన్ని కంట్రోల్ చేయడానికి ప్రయత్నిస్తాం' అని సినీ నిర్మాత నాగవంశీ అన్నారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తన ప్రతిసినిమా విడుదలకు ముందు తిరుమలకు వచ్చి స్వామిని దర్శించుకోవడం సంప్రదాయంగా మారిందన్నారు. ఈవారంలో 'మ్యాడ్ స్క్వేర్' విడుదల సందర్భంగా శ్రీవారి ఆశీస్సుల కోసం వచ్చానన్నారు.

కార్లలో చోరీలకు పాల్పడే వ్యక్తి అరెస్ట్

తిరుమల, మార్చి25(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని వివిధ పార్కింగ్ ప్రదేశాల్లో కార్ల అద్దాలను పగలగొట్టి దొంగతనాలకు పాల్పడే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులు తమ వాహనాలను పార్కింగ్ చేస్తుంటారు. శ్రీకాళహస్తికి చెందిన హేమచంద్రారెడ్డి అనే వ్యక్తి తన కారును కూడా పక్కనే పార్కింగ్‌లో పెట్టి ఎవ్వరులేని సమయంలో భక్తుల కారు వెనుకభాగంలో ఉండే చిన్నపాటి అద్దాన్ని డ్రిల్లింగ్ యంత్రంతో పగులగొట్టి సెల్‌ఫోన్లు, ఇతర విలువైన వస్తువులు దొచుకుపోతున్నాడు. ఈక్రమంలో భక్తుల ఫిర్యాదు మేరకు తిరుమల పోలీసులు మంగళవారం అతన్ని అరెస్ట్ చేశారు. రూ.60 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు, చెవికమ్మలు, కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. హేమచంద్రారెడ్డిపై ఇప్పటికే పలు చీటింగ్ కేసులతో పాటు రౌడీషీట్ కూడా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. కార్లను పార్కింగ్‌లో ఉంచినప్పుడు విలువైన వస్తువుల విషయంలో జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు.

ముత్యాలమ్మ జాతర ప్రారంభం

● పోలేరమ్మ ప్రతిష్ఠ



బంగారుచీరలో ముత్యాలమ్మ

చిల్లకూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరులో ముత్యాలమ్మ జాతర కన్నుల పండువగా మంగళవారం ప్రారంభమైంది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బంగారుచీరలో బంగారుచీరతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారిని దర్శంచుకున్న భక్తులు ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. తూర్పు కనుపూరు వీధుల్లో ఉదయం ప్రారంభమైన ఘటం ఊరేగింపు సాయంత్రం వరకు సాగింది. రాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి సింహ వాహనంపై అధిష్ఠింపజేసి విశిష్ట పూజలు జరిపారు. అనంతరం అర్ధ రథంపై అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. గంగమిట్ట మీద తాత్కాలికంగా పోలేరమ్మకు వేదిక ఏర్పాటు చేశారు. కోట మండలం సిద్దవకంలో గుడిసెలో కుమ్మరి తయారు చేసిన పోలేరమ్మ విగ్రహాన్ని రజకులు తప్పెట్లు, తాళాల నడుమ మోసుకువచ్చి ప్రతిష్ఠించారు. గాలి గంటల చెట్టు వద్ద కుంభం పోశారు. భక్తులు వేయికండ్ల కుండలలో గండదీపాలు వెలిగించి నెత్తిన పెట్టుకుని, మొలకు వేపాకులు ధరించి ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు.

'నవోదయ'కి 37 మంది విశ్వం విద్యార్థుల ఎంపిక



నవోదయలో సీట్లు సాధించిన విద్యార్థులు

తిరుపతి(విద్య), మార్చి25 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025-26 విద్యాసంవత్సరానికి నిర్వహించిన ప్రవేశపరీక్షల్లో తిరుపతికి చెందిన విశ్వం విద్యాసంస్థల విద్యార్థులు 37మంది ఎంపికైనట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, స్కూల్ చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. విక్రమ్, గోపిక, జీవన్, సాయిరెడ్డి, శరత్‌చంద్ర, నవదీప్‌యాదవ్, జాహ్నవి, జశ్వంత్, మిథున్, మిహాల్, నితీష్‌సాయి, సోహిని, అభ్యుదయ, సోహిత్‌తో పాటు మొత్తం 37మంది సీట్లు సాధించారన్నారు. 35 సంవత్సరాలుగా జాతీయస్థాయిలో నిర్వహించే సైనిక్, నవోదయ, మిలటరీస్కూల్స్ ప్రవేశపరీక్షల్లో తమ విద్యార్థులు విజయపరంపరని కొనసాగిస్తున్నారని చెప్పారు. ఉత్తమ ఫలితాలతోపాటు అత్యుత్తమ మార్కులు, ర్యాంకులు సాధిస్తుండడం సంతోషంగా ఉందంటూ విద్యార్థులను అభినందించారు. ఎంపికైన వారికి కరస్పాండెంట్ ఎన్.తులసీవిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లు అభినందనలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి లక్కీడిప్‌లో కన్సొలేషన్ బహుమతులు

కూపన్లు తీసి 125 మంది పాఠకుల ఎంపిక



కన్సొలేషన్ బహుమతుల కూపన్లను తీస్తున్న 'ఆంధ్రజ్యోతి' పాఠకులు

1. ఆర్.మౌనిష్‌కుమార్, చిత్తూరు
2. జి. వినోద్, పూతలపట్టు
3. కె. పద్మావతి, తిరుపతి
4. జి. సుబ్బరత్నమ్మ , కందూరు, సోమల.
5. ఎ. రుత్విక, తిరుపతి
6. సి. నాగరాజు, కొంగారెడ్డిపల్లి, చిత్తూరు.
7. సి. రామయ్య, పలమనేరు
8. ఎస్. భానుప్రకాష్, బందార్లపల్లి, పూతలపట్టు
9. కె. పల్లవి, మదనపల్లి
10. కె. భాస్కరయ్య, బెంగుళూరురోడ్డు, మదనపల్లి
11. పి. క్రిష్ణయ్య, కట్టకింద వెంకటాపురం, రామచంద్రాపురం
12. ఎ.తేజేష్‌రెడ్డి, పాకాల
13. పి. కళ్యాణ్‌కుమార్, తిరుపతి
14. ఎం. రాజేశ్వరి, రొంపిచెర్ల
15. ఎం.ఎస్.కరుణామాత, కలికిరి
16. ఎ.భాస్కర్, పలమనేరు
17. ఆర్. నిఖిత, అంగళ్లు, కురబలకోట
18. పి.ప్రభాకర్, పుంగనూరు
19. వి. సౌందర్యరాణి, విద్యానగర్ కాలనీ, తిరుపతి రూరల్
20. ఎం.మునిరత్నం నాయుడు, సి.మల్లవరం, తిరుపతి రూరల్
21. పి. వీరరాఘవులు, 10-మినిస్టర్ ఏరియా, చెన్నై
22. దీపక్ మనీషా, తిరుపతి
23. షేక్‌అన్వర్ బాషా, రేణిగుంట
24. వై. లీలావతమ్మ , ఖాదీకాలనీ, తిరుపతి
25. ఎ.నాగరాజు, శ్రీరాంనగర్, పుంగనూరు
26. కె.యుగంధర్, కొండకిందపల్లి, పూతలపట్టు
27. డాక్టర్ కె. ఈశ్వర్‌బాబు, వజ్జిరెడ్డిపల్లి, పూతలపట్టు
28. జే. రేవతి, కలికిరి
29. ఆర్.క్రిష్ణమూర్తి, పాత అలిపిరి రోడ్డు, తిరుపతి
30. ఎస్.మమత, రాజీవ్‌గాంధీనగర్ కాలనీ, తిరుపతి
31. ఎన్.గోవిందస్వామి, నంగమంగళం, గుడిపాల
32. కె. దామినిప్రియ, స్టాఫ్ క్వార్టర్స్, తిరుపతి
33. ఎం.నటరాజ్‌శెట్టి, బేరివీధి, కార్వేటినగరం
34. ఎల్.కమల్‌క్రిష్ణ, మధురానగర్, తిరుపతి
35. ఎ. స్వర్ణ, కొంకావీధి, తిరుపతి
36. పి. వెంకటరమణ, మంగళంపేట, పులిచెర్ల
37. కె.ఓంప్రసాద్, జీవకోన, తిరుపతి
38. టి. రామిరెడ్డి, అంబేద్కర్‌కాలనీ, చంద్రగిరి
39. వి.ఎస్. హర్షవర్ధన్, సంతపేట, చిత్తూరు
40. ఎం. భార్గవి, విజయ్‌నగర్ కాలనీ, మదనపల్లి
41. డి. సాయిఫణీంద్ర, శంకర్‌నాయుడు కాలనీ, తిరుచానూరు
42. ఎ. రమేష్, రెడ్‌క్రాస్ స్ట్రీట్, చిత్తూరు
43. సి.ఎం. చౌడప్ప, రామకుప్పం
44. ఎన్. గజపతి, తూగుండ్రం, జి.డి.నెల్లూరు
45. టి. నరసింహులు, బంగారుపాళెం
46. డాక్టర్ వి. శ్రీనివాసులునాయుడు, పోస్టల్ కాలనీ, తిరుపతి
47. ఎస్. మాధవన్, దొడ్డిపల్లి, చిత్తూరు
48. జి. చంద్రశేఖర్, శేషప్పతోట, మదనపల్లి
49. ఎ. రమేష్, మిట్టూరు, చిత్తూరు
50. కె. అమల, వైకుంఠపురం, తిరుపతి
51. జి.సునీల్, చింతపర్తి, వాయల్పాడు
52. జి. సుబ్రమణ్యం, ఎన్‌జీఓ కాలనీ, తిరుపతి
53. ఎస్.ఆర్. రఘుమ, ఎస్‌బిఐ కాలనీ, మదనపల్లి,
54. ఎస్. చిరంజీవులు రెడ్డి , కార్వేటినగరం
55. ఎస్. అరుణాచలం, కొప్పేడు హరిజనవాడ, నింద్ర
56. ఎస్. ప్రవీణ్ కుమార్‌రెడ్డి, రామకుప్పం
57. వి.లోహిత్‌కుమార్, కొంగారెడ్డి పల్లి, చిత్తూరు
58. ఎ. సురేష్, మునగలపాలెం, ఏర్పేడు
59. ఎస్. చర్వాణిశ్రీ, పి.కె. లేఔట్, తిరుపతి
60. వి. జ్యోతిష్మతి, గాంధీరోడ్డు, తిరుపతి
61. పి. రాంబాబు, కొర్లగుంట, తిరుపతి
62. భ్రమరాంబ, సత్యనారాయణపురం, తిరుపతి
63. కె. వెన్నెల, అన్నాసంపల్లి, రేణిగుంట
64. యామిని, ఎస్టీవి నగర్, తిరుపతి
65. జి.నాగభూషణమ్మ, ఎయిర్ బైపాస్‌రోడ్డు, తిరుపతి
66. బి.మోహనరంగారెడ్డి, శివాలయంవీధి, వరదయ్యపాలెం
67. శిల్పిక, వైష్ణవి నగర్, తిరుచానూరు
68. బి.ఎం.ఇందిరాకుమార్, హర్షిత హోటల్, వి.కోట
69. బి.మంజునాథ్, నడివీధి, వి.కోట
70. వి.రామచంద్రయ్య, రాధాక్రిష్ణ స్ట్రీట్, తిరుత్తణి
71. కె. క్రిష్ణమూర్తి, కెప్టెన్ లక్ష్మి వీధి, మదనపల్లి
72. డి. గంగాముని ప్రసాద్, పంట వీధి, తిరుపతి
73. వి. ఆనందరావు, ఎస్.డి.లేఔట్, తిరుపతి
74. సాహిద్‌షబీనా బేగం, తిరుచానూరు
75. జె.రాధాక్రిష్ణ, బాసరివీధి, వడమాలపేట
76. ఎస్.హర్షిణి, ముద్దుక్రిష్ణాపురం, పుత్తూరు
77. బి. కవిత, గాంధీపురం, తిరుపతి రూరల్
78. ఎం. రజని, చిత్తూరు
79. ఎ. శివమోహన్, లక్ష్మీనగర్ కాలనీ, పలమనేరు
80. డి. మోహన్, కె.టి.క్వార్టర్స్, తిరుపతి
81. డి. ప్రభాకర్, పుదిపట్ల, తిరుపతి రూరల్
82. కె. ధనలక్ష్మి, శాంతినగర్, తిరుపతి
83. డి.అశోక్, కొంగారెడ్డిపల్లి, చిత్తూరు
84. టి. గిరిధర్, బాలాజీ కాలనీ, తిరుపతి
85. కె.ఆర్.పూజిత, మురకంబట్టు, చిత్తూరు
86. హేమ, ఆవులపెద్దిరెడ్డిగారి పల్లి, పులిచెర్ల
87. జి.సుభాషిణి, శివజ్యోతినగర్, తిరుపతి
88. జి.క్రిష్ణమనాయుడు, జీవకోన, తిరుపతి
89. ఎ.మేఘ, బి.ఎన్. కండ్రిగ
90. సుజాత, భారతినగర్, చంద్రగిరి
91. వి. జయంతి, శ్రీనగర్ కాలనీ, పలమనేరు
92. ఎం.శ్రీలక్ష్మి, ట్రిప్లికేన్, చెన్నై
93. వి. రామతులసి, ఆర్.సి.రోడ్డు, తిరుపతి
94. ఎస్. అక్బర్, భగత్‌సింగ్ కాలనీ, రేణిగుంట
95. సి.ఆర్.సమీరారెడ్డి, గంగవరం
96. ఎస్. విజేత, మాధవనగర్, తిరుపతి
97. డి. వెంకటరమణ, పెరుమాళ్లపల్లి, తిరుపతి
98. ఎం. సుబ్బరామిరెడ్డి, తోటపల్లి, పాకాల
99. పి. సతీష్‌కుమార్, నిమ్మనపల్లి
100. డి. వరలక్ష్మి, మాతమ్మగుడి వీధి, తిరుపతి
101. వి.భువన్‌కుమార్, అంజిమేడు, ఏర్పేడు
102. ఎస్. అక్బర్ జమీర్, రాంనగర్ కాలనీ, చిత్తూరు
103. పి. కాంతమ్మ, వేపమానువీధి, తిరుచానూరు
104. డి. శ్రీలేఖ, ఎస్.వి.నగర్, తిరుపతి
105. పి.వేణు, ఐతేపల్లి, చంద్రగిరి
106. పి. శ్రీనివాసులు, శ్రీనగర్‌కాలనీ, పలమనేరు
107. జి. భువనేశ్వరి, కె.కె. లేఔట్, తిరుపతి
108. పి.సుల్తాన రజియా, మునిరెడ్డినగర్, తిరుపతి
109. బి. ఉదయశంకర్, భగత్‌సింగ్ కాలనీ, పుంగనూరు
110. డి. వేణుగోపాల్, లక్ష్మీపురం, తిరుపతి
111. సుభద్ర, న్యూకాలనీ, చెన్నై
112. కె. కామేశ్వరరావు, ఉప్పరపల్లి, తిరుపతి
113. కె. వెంకోబరావు, డి.ఆర్.మహల్‌రోడ్డు, తిరుపతి
114. కె. యువరాజు, సత్యనారాయణపురం, తిరుపతి
115. ఎం. శ్రీనివాసులు, శివజ్యోతినగర్, తిరుపతి
116. పి. ముఖేష్, జీవకోన, తిరుపతి
117. ఎస్.రెడ్డీశ్వరి, సదుం
118. కె.ఎం. ఉషారాణి, ఎం.బి.రోడ్డు, పుత్తూరు
119. కె. తేజశ్రీ, రాటకొండ సరస్వతమ్మ వీధి, మదనపల్లి
120. పి.వి.దివ్యసాయి, గాంధీనగర్, కుప్పం
121. ఎం. రోహిత్, నిమ్మనపల్లి,
122. ఎ. జనార్ధన్‌రెడ్డి, గంగవరం
123. జి. కల్పన, గుంతలపేట, రామసముద్రం
124. ఎస్. సతీష్, రజకవీధి, పుత్తూరు
125. జి. చిరంజీవి, రాజీవ్ నగర్, మదనపల్లి

అభివృద్ధి పనులకు.. పునర్విచారణ నివేదికకు

ముడిపెట్టొద్దు

● పుత్తూరు కౌన్సిల్ తీర్మానంపై ఆర్డీ విశ్వనాథ్



పునర్విచారణపై సమీక్షిస్తున్న ఆర్డీ విశ్వనాథ్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్, ఈఈ సుబ్బరాయులు తదితరులు

పుత్తూరు అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో 2019-24 మధ్య జరిగిన అవినీతి ఆరోపణలపై పారదర్శకంగా పునర్విచారణ సాగుతోందని పురపాలక శాఖ రీజనల్ డైరెక్టర్(ఆర్డీ) విశ్వనాథ్ పేర్కొన్నారు. పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్, ఈఈ సుబ్బరాయులుతో కలిసి ఆర్డీ మంగళవారం పుత్తూరు మున్సిపాలిటీలో పునర్విచారణపై సమీక్షించారు. ఈ సందర్భంగా పునర్విచారణ పురోగతిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు అందిస్తున్నామన్నారు. అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రస్తావించిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. ఇటీవల పుత్తూరు మున్సిపల్ కౌన్సిల్‌లో పునర్విచారణ నివేదిక తరువాతే అభివృద్ధి పనులకు ఆమోదం తెలపడం జరుగుతుందన్న చైర్మన్ నిర్ణయం పట్ల ఆర్డీ విశ్వనాథ్ స్పందించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపట్టే అభివృద్ధి పనులను, అవినీతి ఆరోపణలపై ఇచ్చే నివేదికకు ముడిపెట్టడం సమంజసం కాదన్నారు. పునర్విచారణలో వెలుగు చూస్తున్న అక్రమాల గురించి మీడియా ప్రశ్నించగా ఆర్డీ తోసిపుచ్చారు. ఈ సమీక్షలో మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పాల్గొన్నారు.

మెగా డీఎస్సీకి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ పరీక్ష కోసం ఆన్‌లైన్ ద్వారా త్వరలో అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారి జ్యోత్స్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెట్ పరీక్షల్లో అర్హత సాధించి న జిల్లాకు చెందిన బీసీ అభ్యర్థులకు మాత్రమే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 9441456039 ఫోన్ నెంబరును సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

మేయర్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధం

● పావులు కదుపుతున్న కార్పొరేటర్లు

● ఎమ్మెల్యేతో భేటీ

తిరుపతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు మున్సిపల్ పాలకమండళ్లు మేయర్‌పై అవిశ్వాసానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో తిరుపతి కార్పొరేషన్ కూడా ఆ దిశగా అడుగులు వేస్తోంది. మేయర్ పీఠం దక్కించుకోవడానికి కూటమి నేతలు వ్యూహ రచన చేస్తున్నారు. మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశంపెట్టాలంటే ఏపీ మున్సిపల్ చట్టం ప్రకారం నాలుగేళ్ల పదవీకాలం పూర్తి కావాలి. ఈనెల 18వ తేదికి మేయర్‌గా డాక్టర్ శిరీష పదవీకాలం నాలుగేళ్లు పూర్తయింది. వైసీపీకి చెందిన ఆమెను మేయర్ పీఠం నుంచి దించేసి, కూటమి సభ్యురాలు అన్నా అనితను కూర్చోబెట్టాలని భావిస్తున్నారు. ఆమేరకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కూటమి కార్పొరేటర్లు రంగం సిద్ధం చేస్తున్నారు. అవిశ్వాస తీర్మాన నోటీసులు ఇచ్చేందుకు అధికారులను విధివిధానాలను అడిగి తెలుసుకున్నట్టు తెలిసింది.

అవిశ్వాసానికి 26 మంది అవసరం

తిరుపతి కార్పొరేషన్లో ప్రస్తుతం 47 మంది కార్పొరేటర్లు ఉండగా, ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్సీ, ఒక ఎమ్మెల్యే కలిపి 50 మందికి ఓటు హక్కు ఉంది. వీరిలో 50 శాతం అంటే 26 మంది నోటీసుపై సంతకాలు చేయాలి. ఇప్పటికే 10మంది వైసీపీ అసమ్మతి కార్పొరేటర్లు ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన విషయం తెలిసిందే. టీడీపీకి చెందిన డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణతో పాటు అన్నా సిస్టర్స్ కాకుండా మరో 13 మంది వరకు టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. అంటే ఎమ్మెల్యే ఓటుతో పనిలేకుండానే అవిశ్వాసానికి సరిపడా బలం కూటమికి సరిపోతుంది.

ఎమ్మెల్యే ఇంట్లో కార్పొరేటర్ల భేటీ : తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇంట్లో మంగళవారం కూటమి కార్పొరేటర్లు భేటీ అయ్యారు. రాష్ట్రంలో పలుచోట్ల అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెడుతున్నారని, మనం కూడా ముందడుగు వేయాలని చెప్పినట్టు తెలిసింది. కౌన్సిల్లో సరిపడా బలం ఉందని వైసీపీలో ఇమడలేక పలువురు కార్పొరేటర్లు టచ్‌లో ఉన్నారని వివరించినట్టు సమాచారం. ఈనెల 29న జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తిరుపతికి రానున్నారని, ఆయనతో చర్చించి తుది నిర్ణయం తీసుకుందామని ఎమ్మెల్యే చెప్పినట్టు తెలిసింది. డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణతో పాటు కార్పొరేటర్లు ఎస్కేబాబు, అన్నా అనిత, నరసింహాచారి, నరేంద్ర నాథ్, పొన్నాల చంద్ర, కుడితి సుబ్రమణ్యం, వట్టికుంట నారాయణ, సీకే రేవతి, కల్పన తదితరులు ఎమ్మెల్యేతో సమావేశమైనవారిలో ఉన్నారు. కాగా మేయర్ వైసీపీనుంచి పోదని, తమ పార్టీకే కార్పొరేషన్ పీఠమని ఆపార్టీ స్థానిక నాయకత్వం ధీమా వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం.

నేటినుంచి నారా భువనేశ్వరి పర్యటన

కుప్పం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి చంద్రబాబు భార్య, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు.మొదటి రోజు ఆమె గుడుపల్లె, కుప్పం మండలాల్లో పర్యటిస్తారు. హైదరాబాదు నుంచి విమానంలో బయలు దేరి ఉదయం 8.35గంటలకు బెంగళూరుకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా ఉదయం 10.20గంటలకు కుప్పం సరిహద్దుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12.40గంటలకు గుడుపల్లెలోని అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌కు చేరుకుని అక్కడి విద్యార్థులతో ముచ్చటిస్తారు. మధ్యాహ్నం 3.30గంటలకు గుడిచెంబగిరికి చేరుకుని అక్కడి మహిళలతో సమావేశమవుతారు. సాయంత్రం 6గంటలకు కుప్పం చేరుకుని రాత్రి 7 గంటల వరకు టీడీపీ నియోజకవర్గ ముఖ్యనేతలు, సమన్వయ కమిటీ సభ్యులతో సమావేశమవుతారు.గురువారం కూడా కుప్పం మండలంలోనే ఆమె పర్యటన కొనసాగనుంది.

వరి ధాన్యం సేకరణ లక్ష్యం 3700 టన్నులు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులను ఆదుకునేందుకు 3700 టన్నుల వరి ధాన్యం సేకరణ లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించినట్లు జేసీ విద్యాధరి ప్రకటించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ 2024 -25 రబీ సీజన్‌లో ఎంపిక చేసిన మండలాల్లో ధాన్యం సేకరణ చేయాలని అధికారులను ఆదేశించారు. నగరి, విజయపురం, నింద్ర, సదుం, రొంపిచెర్ల, పుంగనూరు తదితర ప్రాంతాల్లో ధాన్యం సేకరణ జరుగుతుందన్నారు.క్వింటాల్‌కు రూ. 2320 ధర చెల్లిస్తామని చెప్పారు. రైతులు అందించే ధాన్యం తేమ శాతాన్ని బట్టి గిట్టుబాటు ధరను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని సూచించారు. పౌర సరఫరాల సంస్థ ల్లాల మేనేజర్ బాలకృష్ణ, డీఎస్వో శంకరన్, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, జిల్లా సహకార శాఖ అధికారిణి నాగవర్ధన తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి నిధులొచ్చాయ్

చిత్తూరు సెంట్రల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను ప్రభుత్వం ఏప్రిల్ ఒకటవ తేదీన పంపిణీ చేయనుంది. జిల్లాలోని 2,65,067 మంది పింఛన్‌దారులకు అందజేసేందుకు అవసరమైన రూ.112.79 కోట్ల నిధులు జిల్లాకు చేరాయి. ఉగాది, రంజాన్ కారణంగా ఈ నెలాఖరులోనే పింఛన్లు పంపిణీ చేస్తారనే వదంతులు వినిపిస్తున్నాయి. ఈ పండుగలు ఒకటి, రెండు తేదీల్లో వస్తే ముందుగానే ఇచ్చే అవకాశం ఉంది. పండుగలు 30, 31 ఆది, సోమవారాల్లో వచ్చాయి. 29న శనివారం పంపిణీ చేస్తే మిగిలిన వారికి 30వ తేదీన ఇచ్చే వీలుండదు. ఈ క్రమంలో ఏప్రిల్ ఒకటవ తేదీనే ఉదయం 7 గంటల నుంచి పింఛన్లు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది అందజేయనున్నారు.

ఎంపీడీవోలు కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదు

- జడ్పీ సీఈవోకు ఎంపీపీల ఫిర్యాదు



జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడితో సమస్యలు చెప్పుకుంటున్న ఎంపీపీలు

చిత్తూరు రూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఎంపీపీలకు జిల్లాలో కొంత మంది ఎంపీడీవోలు కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదని ఏపీ ఎంపీపీల సంక్షేమ సంఘం నాయకులు జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడికి ఫిర్యాదు చేశారు. వారి సమస్యలను పరిష్కరించాలని మంగళవారం జడ్పీ కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీపీ నిధుల విషయంలో పాలకవర్గం అనుమతి లేకుండా కొందరు ఎంపీడీవోలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఎంపీపీ పాలకవర్గం తీర్మానించిన అభివృద్ధి పనులను అమలు పరచకుండా, వర్క్‌ఆర్డర్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. మరికొందరైతే తమను ఇబ్బంది పెట్టేందుకుగాను నిబంధనలకు విరుద్ధంగా గ్రామ పంచాయతీ తీర్మానం కావాలని అడుగుతున్నారని తెలిపారు. ఎంపీపీలకు ఇవ్వాల్సిన వాహన అలెవెన్సులు ఇవ్వకుండా, ఎంపీపీ, ఎంపీటీసీలకు రావాల్సిన గౌరవ వేతనాల బిల్లు పెట్టకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని ఏపీ ఎంపీపీల సంక్షేమ సంఘ నాయకులు జడ్పీ సీఈవోను కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంపీపీలు పాల్గొన్నారు.

పెరగని టమోటా ధరలు



మార్కెట్‌కు తరలించడానికి టమోటాలు సిద్ధం

సోమల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు రైతులను నిరుత్సాహ పరుస్తున్నాయి. మంగళవారం 15 కిలోల బాక్సు ధర రూ.100 లోపే పలకడంతో కూలీలు గిట్టుబాటు కావడంలేదని వాపోతున్నారు. పుంగనూరు, పలమనేరు టమోటా మార్కెట్‌కు బాక్సులు తరలించడానికి బాక్సుకు రూ.18, కమిషన్ 10 శాతంతోపాటు కూలీ ఖర్చులు పెరుగుతున్నాయి. గత మూడు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఎండల తీవ్రతతో టమోటా సాగు కష్టంగా మారింది. పెట్టుబడులు భారీగా ఉన్నాయి. ఇతర జిల్లాలో టమోటా సాగు పెరుగుతోంది. జిల్లాలోని సోమల, పుంగనూరు, చౌడేపల్లె, పలమనేరు, సదుం, కందూరు, కరకమంద, తదితర ప్రాంతాల్లో విడతల వారిగా టమోటా సాగు ఉండి జనవరిలో నాట్లు వేసిన వారికి దిగుబడులు ప్రారంభమయ్యాయి. సోమల మండలంలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో మరో విడత నాట్లు వేశారు. ఇతర రాష్ట్రాల్లో దిగుబడులు ఉండటంతో ధరల్లో మార్పులేకపోవడం జరుగుతోందని వ్యాపారులు అభిప్రాయ పడుతున్నారు. పలమనేరు, పుంగనూరు, మదనపల్లె మార్కెట్లలో ఇదే ధరలు కొనసాగుతున్నాయి.

ప్రజలకు సులువుగా బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్

- ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులతో విజయభాస్కర్

చిత్తూరు అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పిందని, ఇకపై ప్రజలకు సులువుగా బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్‌ను మంజూరు చేస్తుందని అనంతపురం ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్ చెప్పారు. మంగళవారం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల ప్లానింగ్ అధికారులు, సిబ్బంది, లైసెన్స్ ఇంజనీర్లకు బిల్డింగ్ అప్రూవల్స్‌పై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్ పొందడం కొంత మేర కష్టంగా ఉండేదన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీవో నెంబరు 3, 4, 5, 20 ప్రకారం ఇకపై 18 మీటర్ల లోపు లేదా ఐదు అంతస్థుల లోపు భవన నిర్మాణ అనుమతులకు స్వీయ ధ్రువీకరణ పత్రాలు ఇస్తే సరిపోతుందని చెప్పారు. భవన యజమానులు రిజిస్టర్డ్ ఎల్టీపీలు, ఇంజనీర్లు లేదా ఆర్కిటెక్ట్ సమక్షంలో సరైన పత్రాలు సమర్పించి అఫిడవిట్‌ను ఇవ్వాల్సి ఉందన్నారు. అప్రూవల్స్ అయిన లేఅవుట్లు గ్రామ కంఠం, సర్క్యులేషన్ ప్లాన్లు, ఉన్న ప్రాంతాలు, 1985కు ముందు నిర్మించిన భవనాల పునర్మిణానికి ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





ఆలయ కల్యాణ వేదిక వద్ద పంచాంగాలను ఆవిష్కరిస్తున్న ఈవో, తదితరులు - నూతన పంచాంగం

కాణిపాకంలో పంచాంగ ఆవిష్కరణ

ఐరాల(కాణిపాకం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో తెలుగు నూతన సంవత్సరమైన విశ్వావసు నామ గంటల పంచాంగాన్ని మంగళవారం ఆలయ ఈవో పెంచలకిషోర్ ఆవిష్కరించారు. తొలత పంచాంగాలను ప్రధాన ఆలయంలో వరసిద్ధుడి ముందు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈవో తన సిబ్బందితో కలసి పంచాంగాలను ప్రధాన ఆలయం నుంచి కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చి ఆవిష్కరించారు. ఈవో మాట్లాడుతూ వరసిద్ధుడి ఆలయం ఆధ్వర్యంలో మొదటిసారి పంచాంగాన్ని రచించారని, దానిని తాను ఆవిష్కరించడం ఆనంద దాయకమని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ పంచాంగాన్ని కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాంగ రూపకర్త అత్త్రాలి శివకుమార్‌శర్మ, కుప్పా విశ్వనాథశాస్త్రి, శ్రీమూర్తి వెంకటరమణ, ఏఈవోలు రవీంద్ర బాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, అర్చక, వేదపండితులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం శాస్త్ర సాంకేతిక రంగాల్లో నూతన ఆలోచనలను, ఆవిష్కరణలను ప్రోత్సహించే దిశగా అడుగులేస్తోంది. అందులో భాగంగా తిరుపతిలో ఏపీ రతన్ టాటా ఇన్నోవేటివ్ సెంటర్ నెలలోపే ప్రారంభం కానుంది. ఏపీఐఐసీకి చెందిన భవనంలో తాత్కాలికంగా ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి



నూతన ఆలోచనలు..

ఆవిష్కరణలకు ప్రోత్సాహం

- నెలలోపు రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభమయ్యే అవకాశం
- తాత్కాలికంగా ఏపీఐఐసీ భవనంలో ఏర్పాటు
- రూ.50 కోట్లు కేటాయించనున్న ప్రభుత్వం

ప్రపంచీకరణకు తోడు శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎప్పటికప్పుడు వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో విద్యార్థుల్లోనూ, యువతరంలోనూ నూతన ఆలోచనలను, నవ్య ఆవిష్కరణలను ప్రోత్సహించడంతో పాటు అవసరమైన శాస్త్ర సాంకేతిక, ఆర్థిక తోడ్పాటును అందించడానికి సీఎం చంద్రబాబు ప్రాధాన్యమిస్తున్నారు. ఆ క్రమంలో రతన్ టాటా స్ఫూర్తితో ఆయన పేరిట ఏపీ రతన్ టాటా ఇన్నోవేటివ్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. అమరావతి కేంద్రంగా పనిచేసే ఈ హబ్‌కు అనుబంధంగా విశాఖ, రాజమహేంద్రవరం, ప్రకాశం, అనంతపురం, తిరుపతి జిల్లాలలో ఇన్నోవేటివ్ సెంటర్లు ఏర్పాటు చేస్తోంది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ప్రాతిపదికన ఏర్పాటయ్యే ఈ సెంటర్ నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రూ.50 కోట్లు కేటాయించనుంది. ఆపై ఏటా రూ.30 కోట్లు కేటాయిస్తుంది. టాటా ట్రస్టు నిర్వహించే ఈ సెంటర్‌కు ఓఎన్‌జీసీ, కియా, ఎల్ అండ్ టీ, ఎల్జీ, టీవీఎస్, డాక్టర్ రెడ్డీస్, అమరరాజా తదితర పది ప్రతిష్ఠాత్మక సంస్థలు భాగస్వాములుగా వ్యవహరించనున్నాయి. ప్రభుత్వం, టాటా ట్రస్టులతో పాటు ఈ సంస్థలు సైతం సెంటర్ నిర్వహణకు మ్యాచింగ్ గ్రాంట్ కింద నిధులు ఇవ్వనున్నాయి. స్టార్టప్‌లను పెంచడమే ఈ సెంటర్ ఏర్పాటు ఉద్దేశం. దానికనుగుణంగా విద్యార్థులను, పెట్టుబడిదారులను, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఒకచోట చేర్చి స్టార్టప్‌లను విజయవంతం చేయడానికి ఈ సెంటర్ అవసరమైన అన్ని చర్యలకూ సహకరిస్తుంది.

ఎయిర్‌పోర్టు వద్ద తాత్కాలిక భవనంలో..

జిల్లాకు సంబంధించి ఇన్నోవేటివ్ సెంటర్ కోసం ప్రస్తుతానికి తాత్కాలిక భవనాలను గుర్తించారు. రేణిగుంటలోని విమానాశ్రయ సమీపంలో ఏపీఐఐసీకి సంబంధించిన నిరుపయోగ భవనాలను కలెక్టర్ ఎంపిక చేశారు. గతంలో ఆ భవనాలలో ఏపీఐఐసీ జోనల్ కార్యాలయం నడిచేది. కార్యాలయాలన్నీ ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌లోనే ఉండాలని కలెక్టర్ ఆదేశించడంతో ఇటీవలే ఆ కార్యాలయాన్ని కలెక్టరేట్‌కు తరలించారు. దీంతో ఖాళీగా ఉన్న ఆ భవనాల్లో తాత్కాలికంగా ఇన్నోవేటివ్ సెంటర్ ప్రారంభించాలని జిల్లా యంత్రాంగం భావిస్తోంది. దీనిపై ఇటీవల ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి కాటమనేని భాస్కర్ జిల్లా అధికారులతో చర్చించారు. ఈ భవనాల్లో ఇన్నోవేటివ్ సెంటర్ నెలలోపే ప్రారంభించేందుకు జిల్లా అధికార యంత్రాంగం వేగంగా చర్యలు తీసుకుంటోంది.

శాశ్వత భవనాలకు రెండు చోట్ల భూముల గుర్తింపు

రతన్ టాటా ఇన్నోవేటివ్ సెంటర్‌కు శాశ్వత భవనాలు నిర్మించడం కోసం ఐదెకరాల అనువైన భూముల కోసం జిల్లా యంత్రాంగం అన్వేషిస్తోంది. అత్యాధునిక శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన కీలక కేంద్రం కావడంతో దీన్ని జాతీయ రహదారి పక్కనే నిర్మించాలని కలెక్టర్ భావిస్తున్నారు. అందులో భాగంగా పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారికి పక్కన ఉండేలా తిరుపతి రూరల్ మండలం దామినీడు వద్ద, అలాగే రేణిగుంట వద్ద భూములు గుర్తించారు. వీటిని ఐటీ శాఖ ఉన్నతాధికారులు వచ్చి పరిశీలించి ఒకదాన్ని ఖరారు చేయనున్నారు.

పంటలపై ఆగని ఏనుగుల దాడులు



పెరుమాళ్ళపెంట వద్ద ఏనుగులు ధ్వంసం చేసిన వరిపంట



ఏనుగు దాడిలో ధ్వంసమైన వరిపంట

యాదమరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సరిహద్దు గ్రామాల్లో పంట పొలాలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. యాదమరి సరిహద్దుల్లో తిష్టవేసిన గజరాజుల గుంపు అటవీ సమీప గ్రామాల పంటలపై దాడులు చేస్తూనే ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం రాత్రి 14 ఏనుగుల గుంపు పెరుమాళ్లపెంట, పెదకంటిపల్లి, మార్లబండ గ్రామ సమీపంలోని వరి, అరటి, చెరకు పంటలను ధ్వంసం చేసినట్లు బాధిత రైతులు రామమూర్తి, రమేష్, వివేకానంద, శ్రీధర్ తెలిపారు. గజరాజులు ధ్వంసం చేసిన పంటలను ఎఫ్‌బీవో ప్రతాప్, అటవీ సిబ్బంది మంగళవారం పరిశీలించారు. నుంజర్ల ప్రాజెక్టులో మాటు వేసిన ఏనుగుల గుంపు రాత్రివేళల్లో మూడు బ్యాచ్‌లుగా విడిపోయి పంట పొలాలపై దాడి, పొలాల్లో కంచెలను విరిచేస్తూ, ఫెన్సింగ్, వ్యవసాయ పొలాల్లో నీటి సరఫరా చేసే పైపులు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ధ్వంసం చేసి టెంకాయ చెట్లు, మామిడి, అరటి, రాగి, మిరప పంటలు తొక్కుతున్నాయి. పంటలపై ఏనుగులు దాడులు చేయకుండా అటవీ ప్రాంతంలోకి మళ్లించేందుకు అటవీ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. ఏనుగుల దాడుల నుంచి పంటలను రక్షించేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

గజ దాడులు

కల్లూరు: పులిచెర్ల మండలం కమ్మపల్లి పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లి వద్ద సోమవారం రాత్రి ఒంటరి ఏనుగు పంటలను ధ్వంసం చేయడంతో రైతులకు నష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతం సూరప్పచెరువు సమీపంలోని బోడబండ నుంచి ఒంటరి ఏనుగు బాలిరెడ్డిగారిపల్లి వద్దకు చేరుకుంది. గ్రామంలోని రైతులు మోహన్‌రెడ్డి, మనోజ్‌లకు చెందిన వరిపంటను ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు కొబ్బరి చెట్లనూ విరిచేసింది. మరో రైతు రమణారెడ్డికి చెందిన పశుగ్రాసాన్ని తొక్కేసింది. అక్కడి నుంచి తిరుగుముఖం పట్టిన ఒంటరి ఏనుగు మార్గంలోని పలువురు రైతుల మామిడిచెట్లను విరుచుకుంటూ అడవిలోకి చేరుకుంది. ఉదయం ఒంటరి ఏనుగు ధ్వంసం చేసిన పంటలను ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ, ఎఫ్‌బీవో కృష్ణమూర్తి పరిశీలించారు. బాధిత రైతులకు నష్ట పరిహారం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

డీసీసీబీలో విచారణకు హాజరైన ఆరుగురు సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో సహకార చట్టం సెక్షన్ 51 మేర మంగళవారం విచారణ జరిగింది. ఆరుగురు సిబ్బంది హాజరై తమ వాంగ్మూలాన్ని విచారణ అధికారి, డీఆర్వో మోహన్‌కుమార్‌కు అందించారు. డీసీసీబీ పరిధిలో గత ఐదేళ్లకాలంలో జరిగిన ఆర్థిక అవినీతి అక్రమాలపై గత శుక్రవారం నుంచి విచారణ ప్రారంభమైంది. ఇప్పటివరకు 12 మంది సిబ్బందిని విచారించారు. ఈ విచారణ వరుసగా ఏప్రిల్ 9వ తేదీ వరకు కొనసాగనుంది.

ఆస్తి పన్నులో 50శాతం వడ్డీ రాయితీ

చిత్తూరు అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని భవనాలు, ఖాళీ స్థలాలకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నులను 2025 మార్చి 31లోగా చెల్లించిన వారికి 50 శాతం వడ్డీరాయితీని ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నగరపాలక పరిధిలోని భవనాలు, వ్యాపార సముదాయాలు, ఖాళీ స్థలాల యజమానులు పన్నులు చెల్లించి నగరపాలక అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు. ఈ రాయితీ వడ్డీ సొమ్మును రాబోయే సంవత్సరానికి జమ చేయనున్నట్లు చెప్పారు. పన్ను చెల్లింపుదారుల కోసం నగరపాలక కార్యాలయంలో ఏడు కౌంటర్లను ఏర్పాటు చేశామని, ఇవి ఉదయం 8గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పనిచేస్తాయన్నారు. స్థానిక వార్డు సచివాలయాల్లోనూ పన్నులు చెల్లించవచ్చన్నారు.



సంతలో రూ.1.50 లక్షల విలువ చేసే పొట్టేలు

జాతర సంతలో ఆకట్టుకున్న పొట్టేళ్లు

పుంగనూరు రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సుగుటూరు గంగమ్మ జాతర సందర్భంగా మంగళవారం గొర్రెలు, పొట్టేళ్ల సంత పుంగనూరు ఆర్టీసీ డిపో సమీపంలోని మఠం వద్ద నిర్వహించారు. గతం లో జమీందారి ప్యాలెస్ ఆవరణలో జరిగే గొర్రె పొట్టేళ్ల సంతను మఠం వద్దకు మార్పు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి గొర్రెపొట్టేళ్లతో రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులు వచ్చారు. సంతలో రూ.10 వేల నుంచి రూ.1.50 లక్షల విలువ చేసే పొట్టేళ్ల వ్యాపారం సాగింది.



ఆర్టీసీ బస్టాండు కూడలిలో సీసీ కెమెరాలు



సీసీ కెమెరాలతో సీఐ శంకరయ్య, టీడీపీ నాయకులు

కుప్పం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణం ఆర్టీసీ బస్టాండు కూడలిలోని తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహం, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల వద్ద కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య ఆధ్వర్యంలో మంగళవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కుప్పం నియోజకవర్గ టీడీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు జాకీర్ అహ్మద్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్ వితరణ చేసినట్లు సీఐ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు, చోరీల నివారణకు ఇవి ఎంతో ఉపయోగపడుతాయన్నారు. పట్టణంలోని ప్రతి వ్యాపార సంస్థ, దుకాణాలలో సైతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, గృహాలకు సైతం వీటిని అమర్చుకోవాలని కోరారు.

త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను మంగళవారం కుప్పంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన జ్ఞాన తెలుగు కాలసూచిక (ఉగాది క్యాలెండర్)లో ఎన్నో భగవద్గీత వచనాలు సరళ భాషలో పేర్కొనడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక కుప్పం కమిటీ అధ్యక్షుడు కృష్ణ, సభ్యులు ప్రకాశ్, శరవణ, కృష్ణన్న, సుధాకర్, చందు, నాగరాజు, దేవరాజు, శివకృష్ణ, కృష్ణారెడ్డి, రాజకుమార్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే పాడి పరిశ్రమ అభివృద్ధి



పశుగ్రాసం విత్తనాలను పంపిణీ చేస్తున్న విశ్వనాథ్

శాంతిపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు అన్నారు. మంగళవారం కొలమడుగు గ్రామ సచివాలయం వద్ద రైతు సేవా కేంద్రంలో ప్రభుత్వం రాయితీతో పాడి రైతులకు అందిస్తున్న పశుగ్రాసం విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ నాగరాజు, రమేష్, కొలమడుగు పంచాయతీ టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విరూపాక్షి మారెమ్మకు ప్రత్యేకాలంకరణ



పుంగనూరు రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రైవేటు బస్టాండ్ వద్ద వెలసిన విరూపాక్షి మారెమ్మకు మంగళవారం భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి ఉపవాసాలతో పూజలు చేసి మారెమ్మకు పానకం కుండను గెరిగెలా ఏర్పాటు చేసి పూలతో అలంకరించి వివిధ వేషధారణలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. పట్టణంలో భక్తులకు మజ్జిగ పంపిణీతో పాటు అన్నదానం చేశారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే



పలమనేరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ పండుగ సందర్భంగా ఉపవాస దీక్షలో ఉన్న పలమనేరు ముస్లిం సోదరులకు మంగళవారం రాత్రి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఇఫ్తార్ విందు ఇచ్చారు. పలమనేరు టీడీపీ కార్యాలయం వద్ద భారీ చలువ పందిళ్లు ఏర్పాటు చేసి ముస్లిం సోదరులను, మతపెద్దలను ఆహ్వానించి వారితో కలిసి ఇఫ్తార్ విందు చేశారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ మైనారిటీ అధ్యక్షులు ఖాజాపీర్, పలమనేరు మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చాంద్‌బాషా, ముస్లిం మతపెద్దలు, మైనారిటీ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపండి



తహసీల్దారు కొలేష్‌ను సత్కరిస్తున్న జనసేన నేతలు

రామకుప్పం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండల కొత్త తహసీల్దారు కొలేష్‌ను మంగళవారం జనసేన మండల నేతలు కలిసి సత్కరించారు. మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా తహసీల్దారును కోరారు. అలాగే మండలంలో పలు చెరువులు, వాగులు, వంకలు ఆక్రమణలకు గురయ్యాయని, ఆ ఆక్రమణల తొలగింపునకు సత్వరం చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరీష్, భాస్కర్, ఉపాధ్యక్షుడు పవన్, నేతలు సోమూనాయక్, మహేష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

సోమల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యకు పరిష్కార చర్యలు చేపట్టినట్లు టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు తెలిపారు. మంగళవారం వల్లిగట్ల పంచాయతీ ఏటిగడ్డ దళితవాడలో తాగునీటి సమస్య ఉండటంతో నూతనంగా బోరు డ్రిల్లింగ్ పనులు చేపట్టారు. అలాగే నగిరిండ్లు, పుట్టావారిపల్లెలో తాగునీటి పైపులైన్ పనులు చేస్తున్నారు. కార్యదర్శి జయరాం, టీడీపీ నాయకులు సుబ్బరాయుడు పాల్గొన్నారు.

'నక్ష' సర్వేకు సహకరించాలి

కుప్పం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలో చేపట్టిన నక్ష సర్వేకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్ ఆధ్వర్యంలో పట్టణ భూ రికార్డులను ఆధునీకరించడమే లక్ష్యంగా నక్ష కార్యక్రమం అమలుకు దేశంలోని 10 మున్సిపాలిటీలను ఎంపిక చేసినట్టు చెప్పారు. ఈ పదింటిలో కుప్పం మున్సిపాలిటీ ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు. నక్ష సర్వే కార్యక్రమంతో భూ రికార్డులను మెరుగైన, పారదర్శకతతో కూడిన డిజిటల్ రూపంలో రూపొందిస్తామన్నారు. తద్వారా రిజిస్ట్రేషన్ మోసాలకు ఆస్కారం ఉండదన్నారు. భవిష్యత్తులో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా భూమి రికార్డులను సంబంధిత యజమాని సమక్షంలోనే సర్వే నిర్వహించి సమగ్ర రికార్డులు రూపొందిస్తామన్నారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలో భూమి, ఆస్తి కలిగివున్న ప్రతిఒక్కరూ నక్ష సర్వే కోసం మున్సిపాలిటీ సిబ్బందికి సహకరించాలని కమిషనర్ కోరారు.

డిగ్రీ కళాశాలలో విద్యార్థుల రక్తదానం



కళాశాలలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పలమనేరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఆర్ఆర్‌సీ, వైఆర్‌సీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులతోపాటు ఇతరులు 46 యూనిట్ల రక్తదానం చేశారు. సేకరించిన 46 యూనిట్ల రక్తాన్ని చిత్తూరు ప్రభుత్వ వైద్యశాల రక్తనిధికి అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేసులు, వైస్ ప్రిన్సిపాల్ షణ్ముగం తెలిపారు. శిబిరంలో పలమనేరు వైద్యాధికారిణి యు.లత, కళాశాల ఎన్‌సీసీ అధికారి టి. బాలాజీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకటేష్ బాబు, డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్ఆర్‌సీ, వైఆర్‌సీ కోఆర్డినేటర్ డాక్టర్ జయశంకర్, అధ్యాపకులు డా.నందీశ్వరయ్య, డా.చిదంబరం, దుర్గాప్రసాద్, విక్రమ్‌రాజ్, దినేష్, సిసింద్రీ, విద్యార్థులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఈద్గా సమస్యలు పరిష్కరించాలి

రొంపిచెర్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగచింత గ్రామంలో ఈద్గా సమస్యలు పరిష్కరించాలని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని కోరారు. మంగళవారం చల్లా ఇంటి వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పలువురు గ్రామాల్లో నెలకొన్న సమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు. అధికారులతో ఫోనులో సంప్రదించి పరిష్కరించారు. రొంపిచెర్ల ఈద్గా వద్ద సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని మైనార్టీ నాయకులు కోరారు. సర్పంచ్ ఇబ్రహీంఖాన్, మదసా కమిటీ చైర్మన్ గౌస్‌పీర్‌ఖాన్, మెకానిక్ రఫీ, షేక్ కరీముల్లా పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

పుంగనూరు రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు-భైరెడ్డిపల్లె మార్గంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం పుంగనూరులో జరిగింది. పెద్దపంజాణి మండలం కత్తార్లపల్లెకు చెందిన రెడ్డెప్ప, పురుషోత్తం, వెంకటరమణ గొర్రెలసంతకు ఆటోలో పుంగనూరు వచ్చి తిరుగు ప్రయాణంలో ఆటో బోల్తాపడింది. ప్రమాదంలో గాయపడిన రెడ్డెప్ప, పురుషోత్తం, వెంకటరమణలను పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు.

లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవం



కల్లూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. మంగళవారం ఆలయంలో అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు మాంగళ్యధారణను రమణీయంగా నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు అర్చకులు అనంతకుమారాచార్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

పట్టణమంతా జాతర సందడి..!



గంగమ్మ ఊరేగింపులో బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ పూజలు



గంగమ్మకు సారె తీసుకొస్తున్న టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకనాథరెడ్డి



ప్రత్యేకాలంకరణలో సుగుటూరు గంగమ్మ

పుంగనూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో సుగుటూరు గంగమ్మ జాతర మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. జమీందార్ ప్యాలెస్, సుగుటూరు గంగమ్మ ఆలయం, ప్యాలెస్ ముఖద్వారం తదితర ప్రాంతాల్లో రంగు రంగుల విద్యుత్ దీపాలతో దేవతామూర్తులను విద్యుత్ దీపాలంకరణతో అలంకరించారు. రద్దీ అధికంగా ఉండటంతో చిత్తూరు అదనపు ఎస్పీ రాజశేఖర్‌రాజు, పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ ఆధ్వర్యంలో అడుగడుగునా పోలీసుల నిఘా, సీసీ కెమెరాల పర్యవేక్షణతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పుంగనూరు విద్యుత్‌శాఖ డీఈ శ్రీనివాసమూర్తి, ఏడీఏ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపు, జాతర ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు లేకుండా పర్యవేక్షించారు. భక్తులకు పలువురు చల్లటి మజ్జిగ, పానీయాలు, మంచినీరు, భోజనం పంపిణీ చేశారు. తొలిపూజ సందర్భంగా పరిమిత సంఖ్యలోనే ప్యాలెస్‌లోకి వీఐపీలను పోలీసులను అనుమతించారు. మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి సిబ్బందితో ఊరేగింపు ప్రాంతాల్లో నీరుపట్టడంతోపాటు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు.

తిరుపతి గంగమ్మకు పట్టువస్త్రాల సమర్పణ

పుంగనూరు రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో జరిగే సుగుటూరు గంగమ్మ జాతర సందర్భంగా పుంగనూరు మండలం సింగిరిగుంట గ్రామంలో వెలసిన తిరుపతి గంగమ్మకు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి మంగళవారం పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయంలో పూజలు చేసే అర్చకులు, తోటి కులస్తులకు పట్టు వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, సీవీరెడ్డి, శ్రీకాంత్, వెంకటముని, గువ్వల రమేశ్‌రెడ్డి, ఉయ్యాల రమణ, పోలీస్‌గిరి, దినేశ్, గంగాధర్, రమణ, సుబ్రహ్మణ్యం, చైతన్యరాయల్, కోలాట వెంకటరమణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

248 మందితో జాతర బందోబస్తు

పుంగనూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు గంగజాతరను 248 మందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ భక్తులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, చిన్న ఘర్షణలు జరిగినా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జాతర బందోబస్తుకు ఓ డీఎస్పీ, ఆరుగురు సీఐలు, 13 మంది ఎస్ఐలు, 52 మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 105 మంది కానిస్టేబుళ్లు, 27 మంది మహిళా పోలీసులు, 24 మంది హోంగార్డులు, 21 మంది స్పెషల్ పోలీసులు బందోబస్తులో ఉంటారని ఆయన తెలిపారు.

పంట కాలువ పూడ్చివేతను నిలిపేయండి

ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వి.కోట వాసుల వినతి



అమరనాథరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వి.కోట ప్రజలు

పలమనేరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పలమనేరు నియోజకవర్గం వి.కోట సమీపంలో ఎక్స్‌ప్రెస్ హైవే అధికారులు కర్ణాటక నుంచి వర్షాకాలంలో చెరువులకు నీటిని తీసుకొస్తున్న పంట కాలువను మూసివేశారని.. ఆ కాలువ యథావిధిగా కొనసాగించాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి రైతులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం పలమనేరులోని ఎమ్మెల్యే కార్యాలయానికి వి.కోట మండలంలోని పైపల్లి, పత్రపల్లి, వి.కోట గ్రామస్తులు, రైతులు చేరుకుని వినతిపత్రం అందజేశారు. వర్షాకాలంలో సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రంలోని చెరువులు నిండి ఈ కాలువ నుంచి తమ గ్రామాల్లోని చెరువులకు నీటిని తీసుకొస్తున్నట్లు తెలిపారు. కాలువను పూర్తిగా మూసివేసి మొక్కుబడిగా ప్రత్యామ్నాయంగా చిన్నకాలువను ఏర్పాటు చేశారని.. గ్రామాలు వర్షాకాలంలో నీటమునిగే ప్రమాదం ఉందని ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హైవే అధికారులతో సమస్యపై చరవాణిలో చర్చించారు. వారికి సాగునీరు, తాగునీటికి ఉపయోగకరంగా ఉన్న ఈ పంటకాలువను పరిశీలించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, నారాయణస్వామి, మోహన్‌రెడ్డి, నాసిర్, కేవీఆర్, మోహన్‌గౌడు, తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయండి

- ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కుప్పం పర్యటన విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ మున్సిపల్ శాఖ సమావేశం రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భువనేశ్వరి ఈనెల 26 నుంచి 29 వరకు నాలుగు రోజుల పాటు కుప్పం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నట్లు చెప్పారు. ట్రస్టు తరఫున జరుగుతున్న డీఎస్సీ ఉచిత కోచింగ్ గురించి ప్రస్తావించారు. అలాగే మహిళలకు వివిధ నైపుణ్యాలపై ఉచిత శిక్షణ ఇస్తున్నారన్నారు. తోపుడు బండ్లు, మూడు చక్రాల సైకిళ్ల వంటి ఎన్నో ప్రయోజనాలకు నియోజకవర్గ ప్రజలకు అందించారని చెప్పారు. కుప్పం ప్రజలకు తల్లిలాంటి భువనేశ్వరి పర్యటనకు పార్టీ శ్రేణులు విస్తృతంగా తరలిరావడమే కాకుండా ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

31లోపు ఆస్తి పన్ను చెల్లిస్తే రాయితీ

కుప్పం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘంలో ఈనె 31వ తేదీలోపు ఆస్తి పన్ను లేదా ఖాళీ జాగా పన్ను చెల్లిస్తే సంబంధిత పన్ను అపరాధ రుసుంపై 50 శాతం రాయితీ ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని పురపాలక సంఘాలకు వర్తించేలా ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. ఆస్తిపన్ను బకాయిలున్నవారు పన్నులు చెల్లించి నిర్దేశిత రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

- పుంగనూరు: మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఆస్తి పన్ను ఈనెల 31వ తేదీ లోపు చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వం అపరాధ రుసుంలో 50 శాతం రాయితీ మాఫీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీకి బకాయిపడిన ఇంటిపన్నులు, ఖాళీస్థలం పన్నులు వెంటనే చెల్లిస్తే రాయితీ వర్తిస్తుందన్నారు. పన్నులు చెల్లించిన వారికి రాబోయే ఏడాదికి సర్దుబాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

- పలమనేరు: ఆస్తి పన్ను బకాయిలు ఉన్నవారికి అపరాధ రుసుంలో 50 శాతం మినహాయింపు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి తెలిపారు. మార్చి 31 లోపు చెల్లింపులు చేసిన వారికి మాత్రమే ఈ మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు. పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారి సమీపంలోని సచివాలయాల్లో గాని, మున్సిపల్ కార్యాలయంలో గాని పూర్తిగా చెల్లించి ఈ మినహాయింపు పొందాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఆరోగ్య భద్రత

వి.కోట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషకాహారం, ఆరోగ్యంతో కూడిన విద్య అనే అంశాలపై మంగళవారం బైరెడ్డిపల్లె సీడీపీవో అరుణశ్రీ ఆధ్వర్యంలో వి.కోట పట్టణంలోని ఖాజీపేట ఉర్దూ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వం క్రమం తప్పకుండా గర్భిణులు, చిన్నారులకు పోషకాహారాన్ని అందించాలని సూచించారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేయాలన్నారు. పర్యవేక్షకులు రమాదేవి, సుజాత, మాధవి, రాధ పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

పుంగనూరు రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదల చేసిన నవోదయ ఫలితాల్లో కృష్ణారెడ్డి శ్రీచైతన్య చిల్డ్రన్స్ అకాడమి పాఠశాలలో చదువుతున్న 13 మంది ఉత్తమ ఫలితాలు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతున్న జాగృతి, శృతిలయ, విష్ణు, మౌనిక, రాకేశ్, అనుదీప్‌సాయి, మనశ్వర్, మనశ్విని, పూర్ణచంద్ర, జీవన్‌సాయి, చైత్ర, మధుశ్రీ, శ్రావ్యలు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే ఇంపల్స్ స్కూల్‌లో చదువుతున్న వైదీశిక ఎంపికైనట్లు హెచ్ఎం సంతోష్‌మున్నార్ తెలిపారు.

నేడు ప్యాప్టో నూతన కార్యవర్గం ఎన్నిక

పలమనేరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్యాప్టో ఆదేశాల మేరకు ఈనెల 26వ తేదీన ప్యాప్టో నూతన కార్యవర్గ ఎన్నిక జరుగుతుందని ప్యాప్టో చైర్మన్ మునాఫ్ తెలిపారు. జిల్లా కేంద్రం చిత్తూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు జిల్లా ప్యాప్టో కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు మునాఫ్ తెలిపారు. సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు కార్యవర్గ సమావేశానికి హాజరుకావాలన్నారు. జిల్లా ప్యాప్టో కొత్త కార్యవర్గం ఎన్నిక జరుగుతుందని తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే స్కాన్ సెంటర్లపై కఠినచర్యలు

● డీఎస్పీ, ఆర్డీవో హెచ్చరిక



మాట్లాడుతున్న డీఎస్పీ మహమ్మద్ అజీజ్, పక్కన ఆర్డీవో భవాని శంకరి

నగరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే స్కాన్ సెంటర్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, ఆర్డీవో భవాని శంకరి హెచ్చరించారు. నగరి ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం పీసీపీఎన్డీటీ చట్టం అమలుపై ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో భవానిశంకరి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. నగరి మండలం, పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్లతో నిర్వహించిన ఈ సమావేశంలో డీఎస్పీ, ఆర్డీవోలు మాట్లాడుతూ కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లింగ నిష్పత్తిలో తేడా ఉందని, దీనిని గుర్తించి బాలికల ప్రాధాన్యతపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డికాయ్ ఆపరేషన్లు, కఠిన తనిఖీలు నిర్వహించి పీసీపీఎన్డీటీ చట్టం ఉల్లంఘనలను అరికట్టాలని ఆదేశించారు. స్కాన్‌సెంటర్లు, ఆస్పత్రులు, నర్సింగ్‌హోమ్‌లు నిర్వహించేవారు తప్పనిసరిగా డీఎంహెచ్‌వో అనుమతి పొందాలన్నారు. ఐసీడీఎస్ అధికారులు కూడా భాగస్వామ్యం వహించాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, డెమో జయరాముడు, లీగల్ కన్సల్టెంట్ ఇంద్రాణి, డాక్టర్ జరీనా, సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది



క్రీడా పరికరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

బంగారుపాళ్యం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో పేద విద్యార్థులను ప్రోత్సాహించేందుకు దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని నలగాంపల్లె పంచాయతీ పీడీవీ కండ్రిగలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాతలు సమకూర్చిన క్రీడా పరికరాలను విద్యార్థులకు ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నలగాంపల్లె గ్రామానికి చెందిన ఎన్‌పీ బాలరాజు నాయుడి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, ఎన్ఆర్ఐ ఎన్‌పీ విక్రమ్ పేద విద్యార్థులను విద్య, క్రీడల్లో ప్రోత్సహించేందుకు తన వంతు సహకారం అందించడం అభినందనీయమన్నారు. దాత విక్రమ్ మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థికి ల్యాప్‌టాప్ అందిస్తామని తెలిపారు. తన కుమార్తె ఇషికా, ఆమె స్నేహితురాలు నివేదిత రాజేంద్రలు రూ.60వేల విలువగల క్రీడా పరికరాలను తుంబపాళ్యం, నలగాంపల్లె, బోడబండ్ల, బంగారుపాళ్యం ఉన్నతపాఠశాలలకు అందించారని చెప్పారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, నాయకులు జయచంద్రనాయుడు, ఎన్‌పీ ధరణీ, సర్పంచ్ షీబా స్వామిదాస్, ఎంపీటీసీ ప్రసన్నకుమారి, జనార్దన గౌడ్, నాగరాజ గౌడ్, హెచ్ఎం విజయకుమార్, ఉపాధ్యాయులు హరికృష్ణమ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం



సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

చిత్తూరు అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కార్యాలయంలో జరిగింది. మేయర్ అముద అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కమిషనర్ నరసింహ ప్రసాద్, స్టాండింగ్ కమిటీ సభ్యులు డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమారొరెడ్డి, నిర్మల, శశికుమార్, సుష్మ, అశోక్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా అజెండాలోని అంశాలను ఆమోదించారు. ప్రధానంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరించిన బడ్జెట్ అంచనాలను ఆమోదిస్తూ కౌన్సిల్ సర్వసభ్య సమావేశానికి పంపడానికి అనుమతించారు. ఫారెస్టు రోడ్డులో బీసీ భవన్ నుంచి మ్యాంగో భవనం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూపొందించిన అంచనాలను సాధారణ నిధుల నుంచి వ్యయం చేయడానికి స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై చర్చించి ఆమోదముద్ర వేశారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ, తల్లికి వందనం ప్రకటించిన చంద్రబాబుకు ధన్యవాదాలు

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ, తల్లికి వందనం ప్రకటించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ చెప్పారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏప్రిల్‌లో మెగా డీఎస్సీ, మేలో తల్లికి వందనం ప్రకటిస్తానని సీఎం చెప్పడం పట్ల ఆనందంగా ఉందని అన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను చంద్రబాబు అమలు చేస్తున్నారని చెప్పారు. టీడీపీ కార్యకర్తలు, నాయకుల గౌరవాన్ని ప్రజల్లో మరింత పెంచిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో డీఎస్సీ ఊసేలేదని చెప్పారు. వైసీపీ ఎమ్మెల్యేలు కనీసం అసెంబ్లీకి రాకుండా ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, నేతలు శివకుమార్, వినోద్ కుమార్, జ్యోతినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రత్యేక విద్యుత్ అదాలత్



సమస్యలు తెలుసుకుంటున్న శ్రీనివాస ఆంజనేయమూర్తి తదితరులు

వెదురుకుప్పం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికే ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను కార్వేటినగరంలో నిర్వహించామని రిటైర్డ్ జడ్జి, చైర్‌పర్సన్ వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి అన్నారు. కార్వేటినగరం సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 8 సమస్యలపై వినతిపత్రాలు వచ్చాయన్నారు. వాటిని పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు. ఆర్థిక సభ్యులు కె.రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యులు ఎస్ఎల్ అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు డబ్ల్యువిజయలక్ష్మి, ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎస్.సురేష్‌కుమార్, ఏడీఈ కె.చంద్రబాబు, ఏఈలు రామమూర్తి, తులసీబాబు నాయుడు, రంగనాథం, విజయశేఖర్, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. రాహుకాల పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కారు ఢీకొని స్కూటరిస్టు మృతి



రవి మృత దేహం

వెదురుకుప్పం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న కారు ఢీకొని స్కూటరిస్టు మరణించినట్లు వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతిలో ఓ పెట్రోలు బంకులో కార్వేటినగరం మండలం కేపీఅగ్రహారంకు చెందిన బి.సుబ్రహ్మణ్యం కుమారుడు రవి(26) పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం పనులు ముగించుకుని తిరుపతి నుంచి స్వగ్రామానికి వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం మీదుగా వెళుతుండగా ఇదే మండలంలోని చిన్నపోడుజేను వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో రవి తలకు బలమైన గాయమైంది. అక్కడి నుంచి పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రవిని తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ హేమశ్రీ ధ్రువీకరించారు. బైక్‌పై రవి వెంట ఉన్న అతడి స్నేహితుడు అనిల్‌కు ఎటువంటి గాయాలు కాలేదని తెలిపారు. రవి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బైక్ చోరీపై కేసు నమోదు

వెదురుకుప్పం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కొల్లాగుంట చెక్‌పోస్టు దగ్గర చక్రవర్తి రైస్ మిల్ ముందర పార్కింగ్ చేసిన ఓ బైక్‌ను చోరీ చేసినట్లు అందిన ఫిర్యాదు మేరకు కార్వేటినగరం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మండలంలోని కొటార్వేడు పంచాయతీ వత్తులూరు దళితవాడకు చెందిన బాలసుబ్రహ్మణ్యం బైక్‌ను అక్కడ పార్కింగ్ చేసి ఉండగా, గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

● కార్వేటినగరం మండలం సీడీకండ్రిగలో ఇంటి స్థల విషయమై ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణపై ఫిర్యాదు రావడంతో మంగళవారం కార్వేటినగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగల చోరీపై ఫిర్యాదు

బంగారుపాళ్యం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నగల చోరీపై ఓ మహిళ ఫిర్యాదు చేసినట్లు ఏఎస్ఐ మల్లప్ప మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 22వ తేదీన గుడిపాల మండలం 197 రామాపురం గ్రామానికి చెందిన సుబ్రమణ్యం భార్య చెంగమ్మ బంగారుపాళ్యంలో తన బంధువుల ఇంటికి చిత్తూరు నుంచి ఆర్టీసీ బస్సులో వచ్చింది. తన వద్ద ఉన్న నగల బ్యాగు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులకు తెలిపింది. మంగళవారం బంగారుపాళ్యం పోలీసుస్టేషన్‌లో బంగారు చోరీపై ఫిర్యాదు చేసింది. సుమారు 44 గ్రాముల బంగారం చోరీ అయిందని, వీటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని ఆయన చెప్పారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు మల్లప్ప తెలిపారు.

నేడు చిత్తూరులో ప్రజాదర్బార్

చిత్తూరు సిటీ, మార్చి 25: నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నారు. స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కార్యాలయంలో ప్రతి బుధవారం 'ప్రజా ఫిర్యాదుల స్వీకరణ' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 'కార్యకర్తే అధినేత' కార్యక్రమంలో భాగంగా పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారు.

ఇఫ్తార్ విందు

నగరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నగరిలో ముస్లిం సోదరులకు మాజీమంత్రి ముద్దుకృష్ణమ నాయుడు తనయుడు గాలి జగదీష్ మంగళవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు.

శ్మశానం కోసం స్థల పరిశీలన

పాలసముద్రం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగమాంబాపురం ఆదిఆంధ్రవాడ, అయ్యవారికండ్రిగ గ్రామస్థులకు శ్మశాన స్థలం కేటాయించడానికి మంగళవారం తహసీల్దార్ అరుణకుమారి రెవెన్యూ సిబ్బందితో కలసి ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ప్రస్తుతం ఈ రెండు గ్రామాల ప్రజలు చెరువులను శ్మశానంగా వినియోగించడంతో ఇబ్బందిగా ఉంటోంది. తమకు ప్రభుత్వ స్థలంలో శ్మశాన సౌకర్యం ఏర్పాటు చేసి, రోడ్డు వేయాలని కలెక్టర్‌కు గ్రామస్థులు అర్జీ పెట్టుకున్నారు. కలెక్టర్ సూచన మేరకు రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులతో కలసి తహసీల్దార్ ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. రెండు గ్రామాల ప్రజలకు శ్మశానం కోసం స్థలాలను కేటాయిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ దేవి, సర్వేయర్ గణేష్, వీఆర్వోలు రమేష్ నాయుడు, శ్రీనివాసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వితంతు పెన్షన్ మంజూరు చేయాలని వినతి

వెదురుకుప్పం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం గాజుంకి పంచాయతీ విరాటపురం ఎస్టీ కాలనీకి చెందిన పి.సుభద్రకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకంలో వితంతు పెన్షన్ మంజూరు చేయాలని మంగళవారం కార్వేటినగరం ఎంపీడీవో చంద్రమౌళికి జనసైనికులు వినతిపత్రమిచ్చారు. కార్వేటినగరం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ఉసురుపాటి విజయ్, నాయకులు తయ్యూరు రాజేష్, నరసింహ, అన్నామలై పాల్గొన్నారు.

చెత్త బుట్టల పంపిణీ

వెదురుకుప్పం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం గొడుగుచింత గ్రామంలో మంగళవారం చెత్త బుట్టలను గ్రామ సర్పంచ్ నక్కా బాబు, కార్యదర్శి నరేష్, టీడీపీ, జనసేన నాయకులు మధు, ముని, భాస్కర్ నాయుడు, దాము, నవీన్ నాయుడు, వెంకటాద్రి, కె.మురళి పాల్గొన్నారు.

చిన్నారులకు పోషకాలు అందించండి

పాలసముద్రం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే 6 సంవత్సరాల లోపు చిన్నారులందరికీ ప్రభుత్వం ఇచ్చే పోషక పదార్థాలను సక్రమంగా అందించాలని ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎంఆర్సీ కార్యాలయంలో మండలంలోని అంగన్వాడీ కేంద్రాలలో పని చేసే కార్యకర్తలకు పోషణబీ పడాయిబీ కార్యక్రమంపై మూడు రోజుల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గంగాధరనెల్లూరు సీడీపీవో వినతశ్రీ, ఎంఈవో-2 గిరిజ, సూపర్‌వైజర్లు అనూరాధ, సంగీత తదితరులు పాల్గొన్నారు.

యాదమరి: అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎదుగుదలకు మెరుగైన ఆహారం, నాణ్యమైన విద్యను అందించాలని ఐసీడీఎస్ సిబ్బందికి సూపర్‌వైజర్లు కవిత, లలితమ్మ, సరళకుమారి సూచించారు. కె.గొల్లపల్లి పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు రెండో బ్యాచ్ శిక్షణా తరగతులు మంగళవారం నిర్వహించారు. చిన్నారులకు నాణ్యమైన ఆహారం, విద్యను మెరుగుపరచడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అవగాహన కల్పించారు.

పోషణతో పాటు విద్యనందించాలి

చిత్తూరు అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పోషణతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని సీడీపీవో శ్యామసుగుణ కుమారి చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండో విడత శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం స్థానిక కన్నన్ ప్రభుత్వ పాఠశాలలో పోషణ్ బీ.. పడాయి బీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 6 సంవత్సరాలలోపు పిల్లల్లో ప్రేరణ, సంరక్షణ, పోషణ, విద్యను మరింత ప్రభావంతంగా అందుకోవడానికి ఈ శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కవిత, రాజేశ్వరి, పుష్పావతి, తోయజాక్షి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై దుకాణదారుల ఆక్రమణలు

● వాహనదారులు, విద్యార్థులకు ట్రాఫిక్ కష్టాలు





పలమనేరు-చిత్తూరు రహదారిలో, బంగారుపాళ్యం-అరగొండకు వెళ్లే రహదారిలో ట్రాఫిక్‌తో ఇబ్బంది పడుతున్న ప్రజలు

బంగారుపాళ్యం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తగ్గువారిపల్లె పంచాయతీలో రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాల ముందు రేకుల షెడ్డును యజమానులు రోడ్డుపైకి వేస్తున్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్‌తో ప్రజలు ఇబ్బంది పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. రోజురోజుకు వాహనాలు అధికం కావడంతోపాటు, గ్రామీణ ప్రజలు నిత్యం మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. కాణిపాకం, అర్ధగిరి వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లడానికి భక్తులు కర్నాటక రాష్ట్రం నుంచి పెద్దఎత్తున వస్తుంటారు. ఈరోడ్డులో ఆక్రమణల కారణంగా వాహనాలు ఎదురుపడితే తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. పాఠశాల, కాలేజీ పనిదినాల్లో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. నాలుగు రోడ్ల కూడలి నుంచి అరగొండకు వెళ్లే మార్గంలో కూడా దుకాణాల ముందు మట్టి పోసుకుని ఎత్తును పెంచుకోవడంతో రోడ్డు కుచించుకుపోయింది. వారపు సంత జరిగే రోజుల్లో ఈ రోడ్డును దాటడం చాలకష్టంగా ఉంటోంది. ఈ రహదారి గుండానే తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు తమ సమస్యలు విన్నవించుకోవడానికి ప్రజలు వస్తుంటారు. పంచాయతీ అధికారులు శిస్తులు మాత్రం వసూలు చేస్తారు కానీ సమస్యలను పట్టించుకోడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా తగ్గువారిపల్లె పంచాయతీ అధికారులు స్పందించి దుకాణాల ముందు ఆక్రమణలను తొలగించి రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముస్లింల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఇఫ్తార్ విందులో జేసీ విద్యాధరి



మాట్లాడుతున్న జేసీ విద్యాధరి, పాల్గొన్న ఎమ్మెల్యే జగన్మోహన్ తదితరులు



ఎమ్మెల్యే జగన్మోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం మత పెద్దలు

చిత్తూరు కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ముస్లిం సోదర సోదరీమణులు మత సామరస్యానికి ప్రతీకలని, మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జేసీ విద్యాధరి అన్నారు. మంగళవారం స్థానిక ఉర్దూ ఘర్ షాదీఖానాలో జిల్లా మైనార్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ఇమాంలు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, జేసీ విద్యాధరి, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముదలతో కలిసి రంజాన్ నమాజ్ ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టిందని, ప్రభుత్వం కల్పించిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి బాటలో పయనించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వన్నియకుల క్షత్రియ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నగరపాలక డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ముస్లిం మత పెద్దలు, ఇమాంలతో పాటు, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

లేఅవుట్‌కు స్థలపరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, ఆర్డీవో శ్రీనివాసులు

గుడిపాల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గుడిపాలలో సింగిల్ విండో కార్యాలయం వెనుకభాగంలో వున్న ఐదెకరాల స్థలాన్ని చుడా లేఅవుట్ కోసం మంగళవారం చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, ఆర్డీవో శ్రీనివాసులుతో కలిసి సర్వేనెం.278లో వున్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. చుడా ఆధ్వర్యంలో వెంచర్‌ను అభివృద్ధి చేసి ప్రభుత్వ నిబంధనల మేరకు మధ్యతరగతి, ఉద్యోగులకు ప్లాట్లను విక్రయించనున్నారు. ఈమేరకు మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ స్థలానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపి అనుమతి వచ్చిన వెంటనే తదుపరి చర్యలు చేపడతామని హేమలత తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయంతి, సుమతి, గుణశేఖర్ నాయుడు, వీఆర్వో హేమచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలకు..



చిన్నారులకు బహుమతులందజేస్తున్న ప్రముఖులు

చిత్తూరు సెంట్రల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని ఇండియన్ బ్యాంకు జోనల్ మేనేజర్ ఎం.సెల్వరాజ్, పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.మోహనకుమారి, ఐబీ బీఎం మురళీకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక బృందావన్ సీనియర్ సెకండరీ స్కూల్లో వార్షిక వేడుకలు చైర్మన్ విజయభాస్కర్‌రావు, కరస్పాండెంట్ శైలజకుమారి అధ్యక్షతన జరిగాయి. ముఖ్య అతిథులు మాట్లాడుతూ చదువులతో పాటు క్రీడా, సాంస్కృతిక రంగాల్లోనూ రాణిస్తే విద్యార్థికి ఉజ్వల భవిష్యతు ఉంటుందన్నారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రియతేజ, ఉపాధ్యాయులు సుమతి, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన



అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నగరి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలు సంభవించే సమయంలో ఎలాంటి చర్యలు చేపట్టాలన్న అంశాలపై నగరి అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. నగరి మండలంలోని ఎం.కొత్తూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో మంటలు రేగితే ఎలా బయటపడాలో ప్రత్యక్షంగా చేసి చూపించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీకి కార్యకర్తలే అసలైనబలం

● ఎమ్మెల్యే మురళీమోహన్

చితూరు సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే అసలైన బలమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఐరాల మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానికంగా టీడీపీ బలోపేతం కావాలంటే ప్రతి కార్యకర్త తమ బాధ్యతను నిర్వర్తించాలని చెప్పారు. 'కుటుంబ సాధికార సారధుల నియామకం ద్వారా గ్రామ స్థాయిలో మరింత బలమైన నేతలను సమకూర్చుకోవాలన్నారు. అనంతరం ఐరాల మండల టీడీపీ కార్యకర్తలకు పార్టీ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐరాల టీడీపీ మండల అధ్యక్షుడు గిరిధర్ బాబు, జడ్పీటీసీ సుచిత్ర కన్నయ్య నాయుడు, మాజీ జడ్పీటీసీ లతా బాబు నాయుడు, నేతలు మోతుకూరి సోమశేఖర్ నాయుడు, మణి నాయుడు, స్వర్ణ పాల్గొన్నారు.

29న గంగాధరనెల్లూరు మండల మీట్

గంగాధరనెల్లూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అబ్బూ అనిత అధ్యక్షతన ఈనెల 29వ తేది శనివారం ఉదయం 10గంటలకు జరుగుతుందని ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆయన కోరారు.

వాహనం ఢీకొని విద్యుత్ స్తంభం ధ్వంసం



వాహనం ఢీకొనడంతో పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభం

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు - గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిలో భూమిరెడ్డిపల్లి వద్ద సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో 11 కేవీ విద్యుత్ సరఫరా చేసే విద్యుత్ స్తంభం విరిగి పక్కకు ఒరగడంతో పెనుప్రమాదం తప్పింది. నిత్యం రద్దీగా వాహనాలు తిరిగే అంతర్రాష్ట్ర రహదారిపై ప్రమాద సమయంలో ప్రయాణికుల వాహనాలపై పడితే పెద్ద ప్రమాదం సంభవించేదని స్థానికులు చెబుతున్నారు. ఈ స్తంభాలు అంతర్రాష్ట్ర రహదారికి మరీ సమీపంలో ఏర్పాటు చేయడం, ఒకే స్తంభంపై రెండు వేర్వేరు విద్యుత్ సరఫరా చేసే తీగలు ఏర్పాటు చేయడం కూడా ప్రమాదానికి కారణంగా కనిపిస్తోంది. సాయంత్రం ఎక్స్‌కవేటర్‌తో విరిగిన విద్యుత్ స్తంభాన్ని ఆ శాఖ సిబ్బంది మార్చారు.

దళితుల నివాస స్థలాలకు ఇంటి పట్టాలివ్వించాలి: సీపీఐ



ఇంటిపట్టాలివ్వించాలని నిరసన తెలుపుతున్న దళితులు

నగరి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో ఉన్న నెత్తంకండ్రిగలో దళితులు నివాసముంటున్న స్థలాలకు ఇంటి పట్టాలివ్వించాలని నగరి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. నెత్తంకండ్రిగ దళితవాడ వద్ద మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో ఇంటి పట్టాలు ఇప్పించాలని సీపీఐ ఆధ్వర్యంలో దళిత మహిళలు నిరసన వ్యక్తం చేశారు. గత 30 సంవత్సరాలుగా 80 కుటుంబాల వారు పూరిళ్లలో నివాసముంటున్నారని, వారికి ఇంటి పట్టాలివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంటి పట్టాలివ్వకపోతే ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. యేసయ్య, మధుబాబు, సురేష్, సుబ్బమ్మ, రాసాతి, కాంచన, రాణి, కుందెమ్మ పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలకు యూనిఫాం పంపిణీ



యూనిఫాం అందజేస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్, సీహెచ్‌వో లక్ష్మీనారాయణ తదితరులు

యాదమరి, మార్చి 25 (ఆంధ్ర జ్యోతి): యాదమరి పీహెచ్‌సీ ఆశ కార్యకర్తలకు మంగళవారం వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, సీహెచ్‌వో లక్ష్మీనారాయణ యూనిఫాం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మరింత సేవలు అందించాల్సిన బాధ్యత ఆశ కార్యకర్తలపై ఉందని, వేసవికాలం ప్రారంభమైన దృష్ట్యా రైతులు, పశువులు, గొర్రెల కాపర్లకు వడదెబ్బపై అవగాహన కల్పించాలని తెలిపారు. సూపర్‌వైజర్ సెల్వరాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఉపాధి బహిరంగ సభ

విజయపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో బుధవారం ఉదయం 10:30 గంటలకు ఉపాధి హామీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రాజేంద్ర తెలిపారు. ఉపాధి పనులు నిర్వహణపై 17వ విడత సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

నేడు ఎస్సార్‌పురంలో ప్రజాదర్బార్

శ్రీరంగరాజపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మోహన మురళి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే థామస్ పాల్గొంటారని, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలన్నారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చునని ఆయన తెలిపారు.

దాడుల్లో పట్టుబడిన వాహనాల వేలం రేపు

చిత్తూరు సిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ సీఐ శ్రీహరిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేది చిత్తూరు హెడ్ పోస్టాఫీసు సమీపంలోని రీజనల్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ లేబొరేటరీ ఆవరణలో సారా, కర్నాటక మద్యం అక్రమ రవాణాలో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ప్రభుత్వం నిర్దేశించిన డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.